TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND GUNTUR

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 201 శనివారం, జూన్ 06, 2026 పేజీలు :8 వెల.1/-




## పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి.. సాగు, తాగునీరు అందిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



నాగర్‌కర్నూల్: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సమీక్షకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో రోజు నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించారు. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర చేరుకుని పీఆర్ఎల్ఎస్ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 కాలువల నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరితో కలిసి కాలువల నిర్మాణ పనులను సందర్శించి, జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## శరవేగంగా భూసేకరణ

హైదరాబాద్ : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ పూర్తి చేయకుండా ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవు అని గుర్తు చేస్తూ, మొదటి ప్రాధాన్యత అంశంగా భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. స్థానిక ఎంఎల్ఏలు, ఎంఎల్‌సిలతో సమన్వయం చేసుకుని సంబంధిత జిల్లాల కలెక్టర్లు భూసేకరణ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి వీలైనంత త్వరగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. భూసేకరణకు సంబంధించి అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిలలో

గురువారం సిఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మంత్రులతో కలిసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే ద్వారా కోయి ల్ సాగర్ ప్రాజెక్ట్, కృష్ణా, బీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలతో పాటు జూరాల ప్రాజెక్ట్ డ్యాంను పరిశీలించారు. అ నంతరం జోగులాంబ గద్వాల జిల్లా దరూర్ మండలం గూ డెందొడ్డి రిజర్వాయర్ పంప్ హౌజ్‌ను పరిశీలించారు. మక్త ల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన అనంతరం సాయంత్రం సోమశిలకు చేరుకున్నారు. అక్కడ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టలపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌తో పా టు ఆ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించా రు. మూడు గంటలకుపైగా కొనసాగిన ఈ సమావేశంలో ప్రాజెక్టలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.




## హిమంత మంత్రివర్గ విస్తరణ.. 12 మందికి చోటు




గువాహటి: అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తన మంత్రివర్గాన్ని శుక్రవారంనాడు విస్తరించారు. కొత్తగా 12 మంది ఎన్డీయే ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు. గువాహటిలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రి మండలి సభ్యులసంఖ్య 17కు చేరింది.కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల్లో అశ్విని రాయ్ సర్కార్, అశోక్ సంఘాల్, బిమల్ బోరా, బిశ్వజిత్ డైమరీ, జయంత మల్లా బరువా, కౌషిక్ రాయ్, కేషబ్ మహంతా, కి?ష్ణేందు పాల్, నీలిమా దేవి, పిజుష్ హజారికా, రనోజ్ పెగు, సుశాంత బోర్గో హైన్ ఉన్నారు. బిన్న భాషా సమ్మేళనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మంత్రులు వివిధ భాషల్లో ప్రమాణస్వీకారం చేశారు. అస్సామీలో పలువురు ప్రమాణం చేయగా, బిమల్ బోరా సంస్కృతంలో, కౌషిక్ రాయ్ హిందీలో, కృష్ణేందు పాల్ బెంగాలీలో ప్రమాణం చేశారు.అస్సాంకు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు అజంతా నియోగ్, రామేశ్వర్ తేలి, అసోం గణపరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేత చరణ్ బోరో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖనకపురలోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. 129 మంది సభ్యుల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో సహా 19 మంది మంత్రులకు మంత్రివర్గంలో అవకాశం ఉంది.

## డీకే శివకుమార్‌కు షాక్‌ల మీద షాక్‌లు

బెంగళూరు, జూన్ 4: కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 24 గంటలు గడవక ముందే సీఎం డీకే శివకుమార్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఉదయం రామలింగారెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు. కాసేపటికే మునియప్ప అసంతృప్తి గళమెత్తారు. మరి కొంతమంది సీనియర్లు కూడా ఇదే బాటలో ఉన్నారని తెలుస్తోంది. శాఖల కేటాయింపు విషయంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రభుత్వంలో అసంతృప్తి స్వరాలు పెరుగుతున్నాయి. సీనియర్ నాయకుడు కేహెచ్ మునియప్ప తన ప్రస్తుత శాఖలో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు, మంత్రి రామలింగారెడ్డి కూడా శాఖల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కె.హెచ్. మునియప్ప మాట్లాడుతూ, తనకు పోర్ట్‌ఫోలియో మార్పు కావాలని పార్టీ నాయకత్వం ముందు డిమాండ్ చేసినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ ఇటీవల కర్ణాటక పర్యటన సందర్భంగా కూడా తాను ఈ అభ్యర్థన చేసినట్లు ఆయన చెప్పారు.తాను ఈ విషయాన్ని రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో కూడా చర్చిస్తానని మునియప్ప అన్నారు . సీనియర్ నాయకులకు ప్రోటోకాల్, అనుభవం ఆధారంగా పోర్ట్‌ఫోలియోలను కేటాయించాలని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు సాంఘిక సంక్షేమం, వ్యవసాయం లేదా నీటిపారుదల శాఖలను కేటాయిస్తే ప్రజలకు మరింత మెరుగ్గా సేవ చేయగలనని పేర్కొంటూ, మునియప్ప ఈ శాఖల పట్ల తన ఆసక్తిని వ్యక్తం చేశారు. తాను గత మూడేళ్లుగా ఆహార, పౌర సరఫరాల శాఖను నిర్వహించానని, ఇప్పుడు మార్పు కోరుకుంటున్నానని ఆయన తెలిపారు.శాఖల కేటాయింపు విషయంలో మంత్రి రామలింగారెడ్డి రాజీనామా అంశాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం తెలిపారు. ఆ సీనియర్ కాంగ్రెస్



నాయకుడిని తన ఆప్తమిత్రుడిగా ఆయన అభివర్ణించారు.

**డి.కె. శివకుమార్ ఇంకా ఏం చెప్పారు?**

రామలింగారెడ్డి అభ్యంతరం తనకు కేటాయించిన శాఖ సంబంధించిందని, దీన్ని పరిష్కరిస్తామని శివకుమార్ అన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రామలింగారెడ్డి నా సహచరుడు, ఒక సీనియర్ నాయకుడు. ఆయనకు కేటాయించిన శాఖలో ఎక్కువగా ప్రయాణాలు చేయాల్సి వస్తోందని, ఆయనకు వేరే శాఖ కావాలని చెప్పారు.

నేను ఈ విషయం ఆయనతో చర్చించి ఒక పరిష్కారం కనుగొంటాను. ఆందోళన చెందాల్సిన అవసరం ఏం లేదు."గతంలో, తనకు బెంగళూరు అభివృద్ధి శాఖ ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టుల మంత్రిత్వశాఖ కేటాయించని రెడ్డి ఆరోపించారు. మాట తప్పినందునే తాను రాజీనామా చేస్తున్నాని అన్నారు.

## మైత్రీవనం అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్, జూన్ 5: మైత్రీవనం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హర్ష మెస్‌ను కూడా రంగనాథ్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మైత్రీవనం సమీపంలో ఉన్న కేఎస్ఆర్ భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తామన్నారు. నాలాను ఆక్రమించి భవనం కన్‌స్ట్రక్షన్ జరిగితే కచ్చితంగా కూలగొడతామని స్పష్టం చేశారు. కేఎస్ఆర్ భవనం షాప్స్ పక్కనే ఉన్న హర్ష డీలక్స్ మెస్‌ను కూడా పరిశీలించామన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసుల విచారణ జరుగుతోందని తెలిపారు.హర్ష మెస్ డీలక్స్‌లో స్పార్క్ వల్ల ప్రమాదం జరిగిందా?.. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలుతుందని రంగనాథ్ వెల్లడించారు. నాంపల్లి బిల్డింగ్ అగ్నిప్రమాదం అనంతరం ఎన్‌ఓసీలు జారీ చేశామన్నారు.

### ప్ర రా బి నేటిమాట..

మనిషిగా పుట్టడం ఒక అద్భుతం,బ్రతికి ఉండటం ఒక అదృష్టం, ముడిపడుతున్న బంధాలన్నీ ఒక వరాలు, ఎదురయ్యే అడ్డంకులన్నీ మనం నేర్చుకోవాల్సిన పాఠాలు ఇదే జీవితం ఇంతే జీవితం

వస్తువు విలువ కొనే ముందు తెలుస్తుంది. మనిషి విలువ లేనప్పుడు తెలుస్తుంది

చాలా మంది తమకు తెలిసిందే నిజమని వాదిస్తారు. ఒకవేళ ఆది అబద్ధం అని తెలిస్తే ఇంకా గట్టిగా వాధిస్తారు.

వాళ్ళ మాట ఎలాగైనా నెగ్గించుకోవాలని

- ప్రమీల రాణి బి

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్ లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట : మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు,జిల్లా కలెక్టర్ కె. హైమావతి,సిపి రష్మీ పెరుమాళ్,అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, డిఎఫ్ఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.... .పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా అనే పోస్టర్ ఆవిష్కరించారు.

మంత్రి పొన్నం మాట్లాడుతూ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం లాంచనంగా ప్రారంభించాం. ప్రపంచమే కుగ్రామంగా మారుతున్న వేళ పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలిమొక్కలు నాటడం కార్యక్రమంగా కాదు మన జీవితంలో భాగస్వామ్యం కావాలి.హుస్నాబాద్ నియోజకవర్గం లో 280 మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులు గవర్నర్ గారి చేత మీద స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం.500 హోటల్స్ కి గ్లాస్ లు పంపిణీ చేశాం హుస్నాబాద్ మున్సిపాలిటీ,సూర్యాపేట తో కలిసి అవార్డు తీసుకుంటుందిదిల్లీలో కాలుష్యంతో నివసించే పరిస్థితి లేదు.తెలంగాణ లో అలాంటి పరిస్తితి రాకుండా ముఖ్యమంత్రి ఈవి పాలసీ తీసుకొచ్చారు. దేశంలో ఎక్కడ లేని




విధంగా సున్నా టాక్స్ అమలు చేస్తున్నాం.మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాంప్రజలందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి.

## సంపాదకీయం

**శనివారం, జూన్ 06, 2026**

### ప్రాంతీయ పార్టీలకు ఏమౌతోంది...

రాజకీయ పార్టీలు సిద్ధాతాలు ప్రాతిపదికను కాకుండా కేవలం కొన్ని నిర్దిష్ట సమీకరణాల వల్లే ముక్కలవుతున్నాయని స్పష్టమవుతోంది. ప్రాంతీయ పార్టీలలో అత్యధికం కుటుంబ పార్టీలుగా మారడం వాటి పతనానికి ప్రధాన కారణం. అధినేత తర్వాత ఆ స్థానం వారసులకే దక్కాలనే పట్టుదల, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లలో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోంది. మహారాష్ట్రలో మహారాష్ట్రలో పవార్, బెంగాల్‌లో, యూపీలో యాదవ్ కుటుంబంలో జరిగిన గొడవలు దీనికి లైవ్ ఎగ్జాంపుల్స్ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు ప్రస్తుత రాజకీయంలో కీలక పాత్ర పోషిస్తున్నాయనే మరో ఆరోపణ బలంగా ఉంది. అవినీతి కేసుల విచారణలు ఎదుర్కొంటున్న చాలా మంది నాయుకులు, తమ రాజకీయ ఉనికిని , ఆస్తులను కాపాడుకోవడానికి అధికార పక్షంతో, కేంద్రంలో ఉన్న పార్టీతో కలవడానికో, లేదా సొంత పార్టీని చీల్చడానికో సిద్ధపడుతున్నారు. ఆధునిక రాజకీయంలో భావజాలం అనేదానికి విలువ లేకుండా పోయింది. ఒకప్పుడు బద్ధశత్రువులుగా ఉన్న పార్టీలు కేవలంం అధికారం కోసం జత కట్టడం ఆ తర్వాత ప్రయోజనాలు నెరవేరకపోతే చీలిపోవడం సర్వసాధారణమైపోయింది. విపక్షాలకు కాలం చెల్లిపోలేదు. కానీ వారి పాత పద్ధతులకు మాత్రం కాలం చెల్లింది. వారసత్వ రాజకీయాలు, ద్వితీయ శ్రేణి నాయకత్వం లేకపోవడం, కేవలం అధికార పక్షాన్ని తిట్టడమే ఎజెండాగా పెట్టుకవడం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతోంది. విపక్షాలు కేవలం ఎన్నికల పొత్తులపై కాకుండా, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడలి. అప్పుడే మళ్లీ ప్రజల ఆదరణను పొందగలవు. లేదంటే ప్రాంతీయ పార్టీల మనుగడ హిస్టరీగా మారిపోనుంది. ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం ప్రాణం లాంటిది. పాలకుల తప్పిదాలను ఎత్తి చూపుతూ, ప్రజల పక్షాన నిలబడాల్సిన విపక్షాలు నేడు భారత్ రాజకీయాల్లో ఉనికి కోసం పోరాడుతున్నాయి. ఒకప్పుడు ఢిల్లీ పీఠాన్ని శాసించిన శక్తులు, రాష్ట్రాల్లో దశాబ్దాల పాటు ఏక ఛత్రాధిపత్యం వహించిన ప్రాంతీయ పార్టీలు నేడు అంతర్గత కలహాలు, ఫిరాయింపులు, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఢిల్లీ నుంచి దేశం అన్ని రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. అయితే విపక్షాల ఈ పరిస్థితికి కారణం ఏంటీ? ఇప్పుడు చోటు చేసుకుంటున్న పరిణామాలు పంపిస్తున్న సంకేతాలు ఏంటో చూద్దాం. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు చోటుచేసుకుంది. బుధవారం నాడు తిరుగుబాటు ఎమ్మెల్యేలు తామే అసలైన తృణమూల్ అని స్పీకర్‌కు లేఖ రాశారు. ఎక్కువ మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఉన్నందున పార్టీ అధికారం ఇప్పటికే మమత చేతుల నుంచి జారిపోయింది. తృణమూల్ గుర్తుపై గెలిచిన 80 మందిలో, 60 మంది ఇప్పుడు రెబెల్స్‌గా మారారు. ప్రతిపక్ష నాయకురాలు రీటబ్రత బెనర్జీ విలేకరుల సమావేశంలో, "మేము తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాము" అని అన్నారు. 2022లో మహారాష్ట్రలో ఇలాంటి పరిణామాలు ఎదురయ్యాయి. అప్పటి వరకు శివసేనలో నమ్మిన బంటుగా ఉంటూ వచ్చిన ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేశారు. ఉద్ధవ్ థాకరే శివసేన నుంచి మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు విడిపోయారు. వారి పిటిషన్ ఆధారంగా, ఎన్నికల సంఘం అప్పటి తిరుగుబాటు శిబిరాన్ని నిజమైన శివసేనగా ప్రకటించింది. షిండే నిజమైన శివసేన గుర్తించి 'బాణం, విల్లు' చిహ్నం లభించింది. బాలాసాహెబ్ థాకరే సృష్టించిన పార్టీ, ఆ పార్టీ చిహ్నం రెండూ థాకరే కుటుంబం నుంచి జారి పోయాయి. తర్వాత ఎన్సీపీలో చీలక వచ్చింది. శరద్ పవార్ మేనల్లుడు అజిత్ పవార్ మెజారిటీ ఎమ్మెల్యేలతో పార్టీని వీడి వేరు కుంపటి పెట్టారు. తమదై నిజమైన ఎన్సీపీ అంటూ ప్రకటించారు. దీంతో శరద్ పవర్ కూడా తన ఒరిజినల్ పార్టీని కోల్పోయారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కూడా అదే సీన్స్ రిపీట్ అవుతున్నాయి. ఢిల్లీలో ఆప్ పరిస్థితి అలానే ఉంది. ఇప్పటికే మెజారిటీ ఎంపీలు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. తమకను ఆప్ ఎల్పీని విలీనం చేస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత పంజాబ్ వంతు వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఎన్నికలకు మరెంతో కాలం లేనందున అలాంటి పరిస్థితి లేకుండా నేరుగా ఎన్నికల ముందే పార్టీ చీలిపోనుందని అంటున్నారు. సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్ వంటి పార్టీలు తమ ఉనికి కోసం నిరంతరం పోరాడాల్సి వస్తోంది. లోక్‌జనశక్తి లాంటి పార్టీలు ఇప్పటికే కుటుంబ కలహాలతో చీలిపోయాయి. తమిళనాడులో ద్రవిడ రాజకకీయ చరిత్రలో అన్నాడీఎంకేకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే జయలలిత మరణం తర్వాత ఆ పార్టీ రెండుగా చీలిపోయింది. ఎడప్పాడి పళనిస్వామి, ఓ పన్నీర్ సెల్వం, శశికళ, టీటీవీ దినకర్ వర్గాలుగా విడిపోయారు. ఇలా విడిపోవడంతో తర్వాత ఎన్నికల్లో డీఎంకే భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఇప్పుడు విజయ్ టీవీకే అధికారం చేపట్టిన తర్వాత ఒరిజినల్ అన్నాడీఎంకే విడిపోతోంది. చాలా మంది ఎమ్మెల్యే తిరుగుబాటుకు రెడీగా ఉన్నారు. ఇప్పటికే కొందరు రాజీనామా చేశారు. మరికొందరు చర్చలు జరుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇరవ్పుడు ప్రతిపక్ష హోదా చుట్టూ తిరుగుతున్నాయి. గత ఎన్నికల్లో 175 స్థానాలకు కానూ కేవలం 11 స్థానాలకే పరిమితం అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఇప్పుడు అసెంబ్లీలో తన గొంతు వినిపించడానికి న్యాయపోరాటం చేస్తోంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా దక్కాలంటే పది శాతం సభ్యులు ఉండాలి. రాష్ట్రంలో 18 సీట్లు సాధిస్తేనే ప్రతిపక్ష హోదా వస్తుందని కూటమి ప్రభుత్వ వాదన. కేవలం 11 సీట్లు ఉన్న జగన్ మోహన్ రెడ్డికి ఆ హోదా కల్పించలేమని స్పీకర్ కార్యాల యం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వేరే విపక్షం లేదని ఏకైక విపక్షం తమదే కాబట్టి కచ్చితంగా ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనంటూ వైసీపీ పట్టుబడుతోంది. దీనిపై హైకోర్టులో కేసు విచారణ సాగుతోంది. తెలంగాణలో పదేళ్లపాటు తిరుగులేని శక్తిగా వెలిగిన బీఆర్ఎస్ నేడు అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరేందుకు యత్నించారు

- ఎడిటర్

# తృణమూల్ లో టార్గెట్ అభిషేక్

కోల్ కత్తా, జూన్ 6, (న్యూస్ పల్స్)బెంగాల్ లో ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ, సామాజిక పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ముఖ్యమంత్రి సువేందు అధికారి అటు రాజకీయంగా, ఇటు పరిపాలనా పరంగా వేగంగా పట్టు సాధిస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రతిపక్ష తృణమూల్ కాంగ్రెస్ ని చెడుగుడు ఆడుకుంటున్నారు. దీదీ మమత బెనర్జీ హయాంలో తీసుకున్న చాలా నిర్ణయాలను రద్దు చేసేశారు. వాటి స్థానంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న జాతీయవాద దృక్పథంతో వుండే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇది ఇలా వుండగా? ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ చాలా సంవత్సరాలు బెంగాల్ ను పరిపాలించారు. బీజేపీ కార్యకర్తలే టార్గెట్ గా రాజకీయాలు చేస్తూ వచ్చారు. కానీ.. ఇప్పుడు బెంగాల్ లో మమతా బెనర్జీ అధికారంలో లేరు. సహజంగానే ఇప్పటి బీజేపీ ప్రభుత్వానికి మమతా బెనర్జీయే టార్గెట్ కావాలి. కానీ.. అలా కావడం లేదు. మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ లో నెంబర్ 2 స్థానంలో వున్న అభిషేక్ బెనర్జీ టార్గెట్ అవుతున్నారు.ఏకంగా అభిషేక్ బెనర్జీపై దాడే జరిగింది. బీజేపీ నేతలందరకీ అభిషేక్ టార్గెట్ అయ్యారు.గత 15 ఏళ్లుగా తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయించిన ఁఓఅ, 294 మంది సభ్యులు కలిగిన శాసనసభలో కేవలం 80 స్థానాలకు పరిమితమైపోగా, ఃఏఖ ఏకంగా 208 స్థానాలను గెలుచుకుని భారీ మెజారిటీని సొంతం చేసుకుంది. ఈ ఘోర పరాజయం తరువాత, ఁఓఅ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. పార్టీ శ్రేణులు చెల్లాచెదురవుతున్నాయి, నాయకులు పార్టీకి రాజీనామాలు కూడా చేస్తున్నారు.ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ దుస్థితికి ఏ రాజకీయ నాయకుడూ గానీ, ప్రజలు గానీ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీని నిందించడం లేదు; దానికి బదులుగా, ఆ ఆగ్రహమంతా ఆమె మేనల్లుడు, వారసుడైన అభిషేక్ బెనర్జీ వైపే మళ్లుతోంది. కోల్‌కతా ప్రజలలో అభిషేక్ బెనర్జీ పట్ల ఉన్న ఆగ్రహం ఏ ఒక్కసారిగానో ప్రజ్వరిల్లలేదు.అయితే.. దీని వెనుక ఓ కారణం వున్నట్లు అభిప్రాయాలున్నాయి. కాళీఘాట్‌లో ఉన్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసం అత్యంత నిరాడంబరమైందింగా వుండేది. అదే అభిషేక్ బెనర్జీ నివాసమైన "శాంతి నికేతన్" నిత్యం వైభవం, ఆడంబరాలకు ప్రతీకగా వుండేది.బారికేడ్లతో ఆ ప్రాంతాన్ని మూసేసేవారు. దీంతో ప్రజలకు కూడా తీవ్ర అసౌకర్యం కలిగేది. అంతేకాకుండా అభిషేక్ కాన్వాయ్ వెళ్లిన ప్రతీ సందర్భంలోనూ రోడ్లను చాలా సేపు మూసేసేవారు. దీంతో ప్రజలకు అభిషేక్ అంటే విరక్తి పుట్టింది. అభిషేక్ అంటేనే ఆడంబరాలు, అధికార దర్పం అని తేలిపోయింది.తాజాగా టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి అభిషేక్ బెనర్జీ సోనార్‌పూర్ వెళ్లారు. ఆ సమయంలో ఓ గుంపు ఆయన్ను చుట్టుముట్టింది. దొంగ దొంగ అంటూ నినాదాలు కూడా ఇచ్చారు.గుడ్లు, రాళ్లతో కూడా దాడికి దిగారు. అయితే.. దీనికి బీజేపీయే కారణమని టీఎంసీ చెబుతుంటే.. ఏళ్ల తరబడి సాగిన దుష్పరిపాలనపై ఆగ్రహంగానే స్థానికులే దాడికి దిగారని స్థానిక ప్రజలే పేర్కొంటున్నారు.పార్టీలో అభిషేక్ అంచెలంచెలుగా ఎదగలేదు. క్షేత్ర స్థాయి నుంచి రాజకీయంలోకి రాలేదు. అమాంతంగా పార్టీలో ఎదిగిపోయారు. ఏమాత్రం రాజకీయ అనుభవం లేకుండా వచ్చేసి, పార్టీలోని సీనియర్లకు ముచ్చెమటలు పట్టించారు. దీంతో సీనియర్లలో అసంతృప్తి రేగింది. 011 తర్వాత అభిషేక్ ప్రాముఖ్యత పెరగడం వల్లే?చివరికి 2017లో పార్టీని వీడిన?ముకుల్ రాయ్ వంటి సమర్థుడైన వ్యూహకర్త సైడ్ అయిపోయారు. అప్పటి టీఎంసీ నేత, ఇప్పటి ముఖ్యమంత్రి సువేందు విషయంలోనూ ఇదే జరిగింది.ఇక.. మరో అంశంలోనూ పార్టీలో, ప్రజల్లో, కేడర్ లో ఆగ్రహం వుంది. ఐ ప్యాక్ అనే సంస్థను తీసుకొచ్చింది అభిషేకే అని అంటారు. దీంతో కేడర్ చుట్టూ కాకుండా, దాని చుట్టూ రాజకీయాలు తిరిగాయి. క్షేత్రస్థాయి నాయకులను పక్కన పెట్టి, పార్టీ మొత్తాన్ని ఒక "కార్పొరేట్ తరహాలో హైజాక్" చేశారని ఆగ్రహం కూడా వుంది.

# అభివృద్ధిలో పోటీ పడుతున్న రాష్ట్రాలు

హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్) రాష్ట్ర విభజన జరిగి పుష్కరకాలం అవుతోంది. 2014 జూన్ 2న రాష్ట్ర విభజన అధికారికంగా జరిగింది. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ విడిపోతుందని ఎవరు ఊహించలేదు. విడిపోతే రెండు రాష్ట్రాలు ఇబ్బందులు పడతాయి అన్న భావన ఎక్కువగా ఉండేది. కానీ 12 సంవత్సరాల తరువాత వెనక్కి తీసుకుంటే రెండు రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయి. ఉమ్మడి రాష్ట్రపరంగా దక్షిణాది రాష్ట్రాల్లో వెనుకబాటు కనిపించినా.. రాష్ట్ర విభజన తరువాత తెలుగు రాష్ట్రాలు సత్తా చాటాయి. ఇక రాజకీయంగా సైతం తనదైన మార్కు చాటుకు న్నాయి రెండు రాష్ట్రాలు. రెండు రాష్ట్రాల ప్రజలు రాజకీయంగా భిన్న వైఖరి ప్రదర్శించారు. అయినా సరే తన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించారు.రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అనుభవజ్ఞులకు ప్రాధాన్యమిచ్చారు. ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో కెసిఆర్ కు ఛాన్స్ ఇచ్చారు. రాజధాని లేని ఏపీని చంద్రబాబు అయితేనే అభివృద్ధి చేయగలరని ప్రజలు ఆశించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కెసిఆర్ ను గుర్తించి.. అదే రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లగలరని భావించి అవకాశం కల్పించారు. అయితే ఏపీలో ఐదేళ్లకే అధికార మార్పిడి చేశారు. తెలంగాణలో మాత్రం కెసిఆర్ కు తొమ్మిదేళ్లపాటు అవకాశం కల్పించారు. మూడోసారి ఛాన్స్ ఇవ్వకపోగా.. ఏపీలో చంద్రబాబుకు మాత్రం రెండో ఛాన్స్ ఇచ్చి బ్యాలెన్స్ చేశారు. తెలంగాణకు విద్యుత్ సమస్యలు, ఆంధ్రకు ఆర్థిక సమస్యలు వెంటాడుతాయని ఎక్కువ మంది అంచనా వేశారు. కానీ ఆ సమస్యలన్నింటినీ రెండు రాష్ట్రాలు అధిగమించాయి అని చెప్పవచ్చు. ఉమ్మడి రాష్ట్రపరంగా వెనుకబాటు ఉన్నా.. విభజిత రాష్ట్రాలుగా మిగతా దక్షిణాది రాష్ట్రాలకు గట్టి పోటీ ఇచ్చాయి.ఏపీలో మధ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు ప్రజలు. తెలంగాణలో రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ను గుర్తించి ఛాన్స్ కల్పించారు. ఇలా రాజకీయంగా కూడా బ్యాలెన్స్ చేశారు ఉభయ రాష్ట్రాల ప్రజలు.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పుష్కర కాలంలోనే అంతరం పోయింది. మళ్లీ పాత రోజులు మాదిరిగానే సోదర భావం పెరిగింది. పారిశ్రామికంగా తెలంగాణ అభివృద్ధి సాధించగా.. ఏపీ కూడా నవనిర్మాణ దిశ గా అడుగులు వేసింది. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మధ్య కొన్ని రకాల విభజన సమస్యలు ఉండిపోయాయి. చంద్రబాబు, కెసిఆర్ సమయంలో జరగలేదు. కెసిఆర్ కు మిత్రుడైన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మోక్షం కలగలేదు. కానీ ఇటు చంద్రబాబు, అటు రేవంత్ వచ్చిన తర్వాత మాత్రం పురోగతి పెరిగింది. రాష్ట్ర విభజనతో ఏపీ ప్రజలు బాధపడ్డారు మొదట్లో. కానీ పుష్కరకాలం తర్వాత మాత్రం మంచిదే అన్న అభిప్రాయానికి వచ్చారు. తెలంగాణ ప్రజలు ప్రారంభంలో సంబరపడ్డారు. కానీ ఇప్పుడు ఉమ్మడిగా ఉంటేనే కొంత కలిసి వచ్చేదేమో అనే రీతిలో ఆలోచన చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ సెంటిమెంట్ అనేది అక్కడి ప్రజల్లో తగ్గింది. ఆ సెంటిమెంట్తో రాజకీయాలు చేసిన పార్టీల హవా కూడా తగ్గింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయి. ప్రజల ఆకాంక్ష కూడా అదే.

# గ్రేటర్ ఎన్నికల కోసం త్రిశూల వ్యూహం

సికింద్రాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్)హైదరాబాద్ వేదికగా జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభకు పర్మిషన్ నిరాకరణ.. ఆ తర్వాత జరిగిన హైడ్రామా టాలీవుడ్ యాక్షన్ సినిమాను తలపిస్తోంది. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు, నేతలు ఊహించని స్థాయిలో అగ్రెసివ్‌గా దాడికి దిగడం వెనుక.. కేవలం ఒక ప్రెస్ మీట్ వివాదం మాత్రమే లేదు. దీని వెనుక వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలను ప్రభావితం చేయగల అత్యంత లోతైన త్రిశూల వ్యూహం దాగి ఉందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఒక ఇండోర్ మీటింగ్ పెట్టుకుంటే.. దానికి పర్మిషన్ నిరాకరించడమే కాకుండా, గాంధీ భవన్ వేదికగా కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్ వంటి వారు ప్రెస్ మీట్లు పెట్టి పవన్‌ను తెలంగాణ వ్యతిరేకి గా ప్రొజెక్ట్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. కాంగ్రెస్ ఇంతలా రియాక్ట్ అవ్వడం వెనుక ఒక స్పష్టమైన ఫియర్ సైకాలజీ కనిపిస్తోంది. పవన్ వెనుక కేంద్రంలోని బీజేపీ పెద్దల హస్తం ఉందనేది కాంగ్రెస్ అనుమానం. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం బీజేపీకి కష్టమే అయినా.. అదే బీజేపీకి పవన్ కల్యాణ్ గ్లామర్, గ్రేటర్ హైదరాబాద్‌లోని సెటిలర్ల ఓట్లు జతకలిస్తే సమీకరణాలు తారుమారవుతాయని కాంగ్రెస్ భయపడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసే పోటీ చేసినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. కానీ, అప్పటి పరిస్థితి వేరు, ఇప్పటి పరిస్థితి వేరు. నాడు ఏపీలో పవన్ కల్యాణ్ కేవలం ఒక నేత మాత్రమే. కానీ నేడు ఏపీలో డిప్యూటీ సీఎంగా పవన్ ఇక్కడికి వచ్చారు. ఆయన గ్రాఫ్ ఇప్పుడు పీక్స్‌లో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దాదాపు 30 నుంచి 40 శాతం ఉన్న ఆంధ్రా సెటిలర్లు, కమ్మ-కాపు సామాజికవర్గాలు, యువతలో పవన్‌కు ఉన్న క్రేజ్.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ అవకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందుకే, పవన్‌కు ఇక్కడ స్పేస్ ఇవ్వకూడదని కాంగ్రెస్ దూకుడు ప్రదర్శిస్తోంది.ఈ వివాదంలో అత్యంత ఆసక్తికరమైన మలుపు.. పవన్ కల్యాణ్ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్‌ను కడిగిపారేస్తూనే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ప్రశంసలు కురిపించడం. కేసీఆర్ ఒక గొప్ప సంస్కృతి గల నాయకుడని, ఆయన ఎప్పుడూ ఆంధ్రా ప్రజలను అగౌరవపరచలేదని పవన్ సర్టిఫికేట్ ఇచ్చారు. దీనికి తగ్గట్లుగానే కేటీఆర్.. పవన్ కల్యాణ్ విషయంలో ప్రజాస్వామికంగా స్పందించారు. గతంలోనూ జనసేన పోటీ చేసిందని గుర్తు చేశారు. పవన్‌ను నేరుగా విమర్శించకుండా చాలా జాగ్రత్త పడ్డారు. పవన్ కల్యాణ్ పట్ల బీఆర్ఎస్ సాఫ్ట్ కార్నర్ మెయింటైన్ చేయడం వెనుక భవిష్యత్తు పొలిటికల్ ఫ్రెండ్‌షిప్ సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే పవన్ కూడా తనకు కేటీఆర్ మంచి స్నేహితుడని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. పవన్ కల్యాణ్‌కు బీఆర్ఎస్, బీజేపీ జతకట్టకుండా ఉండాలంటే.. ముందుగా పవన్‌ను తెలంగాణ అస్తిత్వానికి శత్రువు గా చిత్రించాలి. తెలంగాణ ఎవరి అయ్య జాగీరు కాదు అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని.. ఆయన తెలంగాణ అమరవీరులను, గద్దర్ వంటి ఐకాన్లను అవమానించారంటూ కాంగ్రెస్ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేస్తోంది. ఒకవేళ బీఆర్ఎస్ గనుక పవన్‌కు బహిరంగంగా మద్దతు ఇస్తే.. అప్పుడు బీఆర్ఎస్‌ను కూడా తెలంగాణ ద్రోహి గా ముద్ర వేసి, సెంటిమెంట్‌తో పొలిటికల్ మైలేజ్ పొందాలనేది రేవంత్ రెడ్డి మార్క్ స్కెచ్ అనుకోవచ్చు.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత దేశవ్యాప్తంగా మారిన పరిణామాలతో.. వచ్చే అసెంబ్లీ లేదా గ్రేటర్ ఎన్నికల నాటికి బీజేపీ + బీఆర్ఎస్ + జనసేన కూటమిగా ఏర్పడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఏపీలో జగన్‌ను గద్దె దించడానికి మూడు భిన్న ధ్రువాలు ఎలాగైతే కలిసాయో.. రేపు తెలంగాణలో రేవంత్ రెడ్డిని గద్దె దించడానికి బీజేపీ-జనసేనతో బీఆర్ఎస్ జతకట్టే అవకాశాలను కొట్టిపారేయలేం.ఏది ఏమైనప్పటికీ, పవన్ కల్యాణ్ హైదరాబాద్ ఎంట్రీతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ చేస్తున్న అగ్రెసివ్ అటాక్.. పవన్‌ను వెనక్కి నెట్టడం పక్కన పెడితే, ఆయనను తెలంగాణ పాలిటిక్స్‌లో మరింత సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మార్చేసింది.పవన్ వెనుక ఉన్నబీజేపీ వ్యూహాలు, బీఆర్ఎస్ వేస్తున్న అడుగులు చూస్తుంటే.. మున్ముందు తెలంగాణలో ఊహించనిపొలిటికల్ ఈక్వేషన్లు తెరపైకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# పవన్ కళ్యాణ్.. అసలు ఎవరు ?

**ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి**

నిజామాబాద్,అసలు పవన్ కళ్యాణ్ ఎవరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. మీ ఏపీ రాజధానిని సరిగ్గా నిర్మించడానికి చేత కాని నువ్వు.. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తావా అని నిలదీసారు. తెలంగాణ ఏర్పడిందని బాధ పడి 11 రోజులు అన్నమే తినని నువ్వు.. మా రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తవా అని ప్రశ్నించారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను.. కేసీఆర్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచేలా పునర్నిర్మాణం చేశారని అన్నారు.

# ముగిసిన డీఎంకే, కాంగ్రెస్ బంధం

చెన్నై, జూన్ 5, (న్యూస్ పల్స్)రాజకీయాలు అంటే అవసరాలు మాత్రమే ఉంటాయి. ఆ సమయానికి అనుకూలంగా ఉన్న వాటితోనే రాజకీయ పార్టీలు స్నేహం కొనసాగిస్తాయి. ఒకసారి అవసరం తీరితే మీకు మీరే మాకు మేమే అన్నట్టుగా వ్యవహరిస్తూ ఉంటాయి. మన దేశ రాజకీయాలలో ఇది కొత్తది కాదు.ఇటీవల తమిళనాడు రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. టీవీకే లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. కాకపోతే అధికారాన్ని సొంతం చేసుకునే విధంగా ఆ పార్టీకి మెజారిటీ రాలేదు. దీంతో అనేక పార్టీల సపోర్ట్ తీసుకుంది. ఇందులో కాంగ్రెస్ కూడా ఉంది. కాంగ్రెస్ మొన్నటి దాకా డీఎంకేకు సపోర్ట్ చేసింది. డీఎంకే మెరుగైన స్థానాలు సాధించకపోవడం.. అన్నిటికంటే ముఖ్యంగా స్టాలిన్ కూడా ఓడిపోవడంతో ఆ పార్టీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా యూటర్న్ తీసుకుంది. మరో మాటకు తావు లేకుండా టీవీ కేకు సపోర్ట్ చేసింది. అంతేకాదు, రాహుల్ గాంధీ విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా హాజరయ్యారు.ఇండియా కూటమిలో ఉంటూ డిఎంకె మిత్రభేదానికి పాల్పడింది. దీంతో అందరు ఊహించినట్టుగానే ఇండియాకూటమి నుంచి డీఎంకే బయటికి వస్తుందని అనుకున్నారు. ఇప్పుడు డీఎంకే అదే పని చేస్తోంది. ఈనెల 8న ఢిల్లీలో ప్రతిపక్ష కూటమి సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో తాము పాల్గొనబోమని డిఎంకె గురువారం స్పష్టం చేసింది. దాని వెనక కారణాన్ని కూడా వెల్లడించింది. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ పాల్గొంటున్నది కాబట్టి.. తాము హాజరు అయ్యేది లేదని డీఎంకే స్పష్టం చేసింది.ఇండియా కూటమిలో అత్యంత బలమైన పార్టీ డిఎంకె. ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. ఆ తర్వాత టీవీ కేకు కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ ఇచ్చింది. దీంతో డిఎంకె ఒకింత అసంతృప్తిగా ఉంది. ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసింది. ఐదు స్థానాలు సొంతం చేసుకుంది. మరోవైపు సమావేశానికి హాజరు కాకపోయినప్పటికీ.. మిగతా పార్టీలు వ్యక్తం చేసే దేశ సంక్షేమ అంశాలపై రాజీపడే ప్రసక్తి లేదని.. ఎప్పటి మాదిరిగా తమ గొంతును వినిపిస్తామని డిఎంకె వెల్లడించింది.. అయితే మరోసారి పార్లమెంటు ముందుకు డీ లిమిటేషన్ బిల్లు వస్తుందని వార్తలు వస్తున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలలో బిజెపి సానుకూల ఫలితాలు సాధించిన నేపథ్యంలో.. ఈ బిల్ పాస్ అవడానికి అవకాశం ఉంది. టిఎంసి ఎంపీలు కూడా ఈ బిల్ ఆమోదం పొందడానికి సహకారం అందించే అవకాశం ఉందని సమాచారం. డీఎంకే కూడా సపోర్ట్ చేస్తుందని తెలుస్తోంది. అలాంటప్పుడు ఇండియా కూటమి ఏం చేస్తుందో చూడాల్సి ఉంది.

# ఎన్వీడియా బంపర్ ఆఫర్

హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్)లే ఆఫ్ లు కొనసాగుతున్నాయి. ఐటీ ఉద్యోగుల జాబ్ లు పోతున్నాయి. మనదేశం నుంచి మొదలు పెడితే అమెరికా వరకు ఇదే పరిస్థితి. ఉద్యోగాలు పోతే వచ్చే అవకాశం లేకుండా పోతోంది. దీంతో ఐటీ విభాగంలో పని చేసే వారు నరకం చూస్తున్నారు. ఉద్యోగం లేక.. వచ్చే అవకాశం లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. చెల్లించాల్సిన ఈఎంఐలు, అప్పులు కొండల మాదిరిగా పేరుకుపోతున్నాయి.లే ఆఫ్ ల వల్ల ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఎన్విడియా కంపెనీ గుడ్ న్యూస్ చెప్పింది. అమెరికాలో ఉంటున్న భారతీయ హెచ్ 1 బీ వీసాదారులు ఉద్యోగం కోల్పోతే 60 రోజుల్లో కొత్త ఉద్యోగం వెతుక్కోవాల్సి ఉంటుంది. లేకపోతే అమెరికా నుంచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీలు మొత్తం ఉద్యోగాలను తొలగిస్తున్న నేపథ్యంలో అనిశ్చితి వాతావరణం ఏర్పడింది.ఈక్రమంలో ప్రఖ్యాత ఐటీ కంపెనీ ఎన్ వీడియా విదేశాలలో ఉన్న ప్రతిభావంతులపై ఫోకస్ పెట్టింది. ఈనేపథ్యంలో హెచ్ 1 బీ వీసాదారులను లక్ష్యంగా చేసుకుంది. వారికి ఇచ్చే నియామకాలను పెంచింది. ఈ ఏడాది తొలి రెండు క్వార్టర్ లలో 1200మంది హెచ్ 1 బీ విభాగం కింద ఉద్యోగులను తీసుకునే అవకాశం ఉంది. దీనికి సంబంధించి అనుమతులను అమెరికా ప్రభుత్వం నుంచి పొందింది.అమెరికాకు హెచ్ 1 బీ వీసాదారులను భారత్ అధికంగా అందిస్తోంది. గత ఏడాది ఈ కంపెనీ హెచ్ 1బీ వీసాదారుల కేటగిరీలో వేయి మందికి ఉద్యోగాలు కల్పించింది ఎన్ వీడియా. ఈ ఏడాది భారీగా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. హెచ్1 బీ వీసాదారుల్లో 70 శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారు. ఆ వీసా కింద ఉద్యోగాలు కల్పించే స్థాయి పెరిగితే భారతీయుల పంట పండినట్టే.ఎన్విడియా నియామకాలను జోరుగా పెంచుతోంది.

# అరుణాచలం గిరిప్రదక్షిణ దారిలో దారుణం

## 23 ఏండ్ల యువతిపై గ్యాంగ్రేప్.. 8 మంది అరెస్ట్

చెన్నై, తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో సంచరించే అరుణాచలం గిరిప్రదక్షిణ మార్గంలో ఇద్దరు యువతులపై దుండగులు దాడి చేయగా, వారిలో ఒక 23 ఏండ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మే 30న రాత్రి గిరిప్రదక్షిణకు వచ్చిన ఇద్దరు యువతులు అడిఅణ్ణామలై ప్రాంతం సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా కొందరు దుండగులు వారిని అడ్డగించారు. తరువాత బలవంతంగా సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ఒక యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. మరో యువతిపై కూడా దౌర్జన్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. దుండగులు బాధితుల నగ్న వీడియోలు చిత్రీకరించి, వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. బాధితుల దగ్గరున్న బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు దోచుకుని అక్కడి నుంచి పరారైయారు. మే 31న తిరువణ్ణామలైలోని మహిళా పోలీస్ స్టేషన్ను బాధితులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఛేదించేందుకు ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసిన అధికారులు, వివిధ ప్రాంతాల్లో గాలింపు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా మొత్తం 11 మంది నిందితులను గుర్తించినట్లు సమాచారం. వారిలో వాసుదేవన్, ఆకాష్, అప్పు, హరిహరన్, అరుణ్ కుమార్, శివగణేషన్తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది

# చాపకింద నీరులా మజ్లీస్

హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్)గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ముందే వాతావరణం హీటెక్కింది. గ్రేటర్ ను సొంతం చేసుకోవాలని అన్ని పార్టీలూ ప్రయత్నిస్తున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మూడు పార్టీలు ఎవరి ఎత్తుగడలు వారు వేస్తున్నారు. మరొకవైపు ఈ ఎన్నికల్లో తాము కింగ్ మేకర్ అవుతామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఎంఐఎం అధికార కాంగ్రెస్ పార్టీతో లోపాయి కారీ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ లోని పాతబస్తీలో ఎక్కువ స్థానాలు గెలిచి తాము కీలకంగా మారాలన్నది ఎంఐఎం ఆలోచన.గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగినప్పటికీ ఎంఐఎం ఒకే విధానాన్నిఅమలు చేస్తుంది. ఎంఐఎం రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతో పరోక్ష పొత్తు పెట్టుకుంటుంది. గ్రేటర్ ఎన్నికల్లో మాత్రం అధికార పార్టీకి మద్దతుగా నిలుస్తూ కీలకమైన పదవులు పొందుతుంది. మేయర్ పదవి ఎటూ దానికి దక్కదు కాబట్టి.. మిగిలిన కీలక పదవులపై పతంగి పార్టీ కన్నేసింది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎంఐఎం ఇదే స్ట్రాటజీని వాడింది. నాడు బీఆర్ఎస్ కు మద్దతుగా నిలిచి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో కీలక మైన పదవులను పొందడంలో అది సక్సెస్ కాగలిగింది.2023 లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఎంఐఎం కూడా తన రూటును మార్చుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తుంది. త్వరలో జరిగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలోనూ ఎంఐఎం తో కాంగ్రెస్ పరోక్ష పొత్తు పెట్టుకుంటుంది. అందుకే ఇటీవల పాతబస్తీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి మంత్రులు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు పర్యటించారు. పాతబస్తీ మాత్రమే కాకుండా మిగిలిన నియోజకవర్గాల్లో ఎంఐఎం ఓటు బ్యాంకు ఉండటంతో కాంగ్రెస్ కూడా దాని మద్దతును తీసుకునేందుకు, లోపాయి కారీ అవగాహన కుదర్చుకునే అవకాశాలున్నాయి. మొత్తం మీద ఎంఐఎం మాత్రం ప్రతి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల సమయంలో కీలకంగా మారేందుకు చేసే ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఈ సారి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఎయిర్ పోర్టు తరహాలో రైల్వేస్టేషన్

హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్)ప్రయాణికులకు ఆకర్షణీయమైన, సకల సౌకర్యాలతో కూడిన ప్రయాణ అనుభూతిని అందించేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రపంచస్థాయి ప్రమాణాలతో రెడీ అవుతోంది. దక్షిణ మధ్య రైల్వే అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పునరాభివృద్ధి పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పురోగతి ఫోటోలు, వివరాలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి బుధవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కేవలం ఒక రవాణా కేంద్రంగానే కాకుండా.. భవిష్యత్ అవసరాలను తీర్చే ఒక భారీ అంతర్జాతీయ హబ్‌గా మారుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఆధునిక రైల్వే గేట్‌వే తెలంగాణ ప్రగతికి ప్రతిరూపమన్నారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగమే ఈ సికింద్రాబాద్ స్టేషన్ మేకోవర్ అని చెప్పారు. స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టును మొత్తం రూ.714.73 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రింబవళ్లు జరుగుతున్న ఈ పనులు ప్రస్తుతం 64 శాతానికి పైగా పూర్తయ్యాయని చెప్పారు. ప్రయాణికుల రాకపోకలకు వీలుగా విశాలమైన ప్రవేశ ద్వారాలు, సరికొత్త వెయిటింగ్ హాళ్లు రూపుదిద్దుకున్నాయి. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు తరహా అనుభూతిని ఇచ్చేలా అత్యాధునిక ఎయిర్‌కాన్‌కోర్స్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. స్టేషన్‌ను ఆధునికీకరించే క్రమంలో ప్రయాణికుల సౌకర్యార్థం కింది ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల ప్రయాణం సులభతరం చేసేందుకు స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారుల పార్కింగ్ ఇబ్బందులను శాశ్వతంగా తొలగించేందుకు అధునాతన మల్టీలెవెల్ కార్ పార్కింగ్ వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు నేరుగా మెట్రో స్టేషన్‌కు చేరుకునేలా అత్యాధునిక స్కైవాక్‌ల నిర్మాణం జోరుగా సాగుతోంది. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో భారీగా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల రక్షణకోసం స్టేషన్ అంతటా అధునాతన హై-డెఫినిషన్ సీసీటీవీ కెమెరాలు అమరుస్తున్నారు.ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే కొన్ని విభాగాలు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల రద్దీని క్రమబద్ధీకరించడానికి నిర్మించిన తాత్కాలిక బుకింగ్ కార్యాలయం, ప్రయాణికుల రక్షణను పర్యవేక్షించే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నూతన భవన నిర్మాణాలు వంద శాతం పూర్తయ్యాయి. వీటితో పాటు స్టేషన్‌కు దక్షిణం వైపున నిర్మిస్తున్న ప్రధాన అప్రోచ్ రోడ్డు పనులు కూడా విజయవంతంగా ముగిశాయి.

# పెన్షన్ల పథకంలో కీలక సంస్కరణలు

హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్) తెలంగాణలో అమలవుతున్న చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల వ్యవస్థలో ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు నగదు చెల్లింపుల విధానాన్ని క్రమంగా నిలిపివేసి, నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు చేయూత పథకం ద్వారా ప్రతి నెలా ఆర్థిక సహాయం పొందుతున్నారు. అయితే ఇప్పటికీ సంఖ్యలో లబ్ధిదారులకు నగదు రూపంలోనే పెన్షన్లు అందుతున్నాయి. గ్రామ స్థాయిలో అధికారులు, పోస్టల్ వ్యవస్థ ద్వారా ఈ పంపిణీ జరుగుతోంది. ఈ ప్రక్రియలో ఆలస్యాలు, అవకతవకలు, మధ్యవర్తుల జోక్యం వంటి అంశాలపై ప్రభుత్వం వద్దకు అనేక ఫిర్యాదులు చేరినట్లు తెలుస్తోందిముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ కోసం పోస్టాఫీసులు లేదా పంపిణీ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు, రికార్డుల లోపాలు కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పెన్షన్ పంపిణీ వ్యవస్థను పూర్తిగా డిజిటల్ మోడ్‌లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త విధానం కింద నగదు రూపంలో పెన్షన్ పొందుతున్న ప్రతి లబ్ధిదారుడికి బ్యాంకింగ్ సౌకర్యం కల్పించనున్నారు. అవసరమైన వారికి పోస్టల్ బ్యాంకు లేదా ఇతర బ్యాంకు ఖాతాలు తెరవడం, వాటిని ఆధార్‌తో అనుసంధానం చేయడం వంటి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.ఇకపై ప్రభుత్వం విడుదల చేసే పెన్షన్ మొత్తం నేరుగా లబ్ధిదారుడి వ్యక్తిగత ఖాతాలో జమ అవుతుంది. దీంతో ఎవరిపైనా ఆధారపడకుండా, వారికి అనుకూలమైన సమయంలో ఏటీఎంలు, బ్యాంకులు లేదా ఇతర డిజిటల్ బ్యాంకింగ్ సేవల ద్వారా సొమ్మును పొందే అవకాశం ఉంటుంది. మరోవైపు కొత్త పెన్షన్‌ల మంజూరులో కూడా ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకురానుంది. ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలుస్తోంది. అలాగే ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక సర్వే వివరాలను అనుసంధానం చేసి అర్హుల జాబితాను మరింత కచ్చితంగా రూపొందిం చనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల వివరాల ధృవీకరణ కోసం 'లైవ్ అథెంటికేషన్' ప్రక్రియ కొనసాగుతోంది. అర్హుల గుర్తింపు పూర్తయిన తర్వాత కొత్త వ్యవస్థను దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తయితే రాబోయే నెలల్లోనే పెన్షన్ సొమ్ము నేరుగా ఖాతాల్లో జమయ్యే విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.పెన్షన్ పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు, అవినీతి అవకాశాలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు చేరడం, మధ్యవర్తుల జోక్యం తగ్గడం, ప్రభుత్వ నిధుల వినియోగంపై మెరుగైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో తెలంగాణలో సామాజిక భద్రతా పథకాలఅమలులోకొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్టే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి : చాడ వెంకటరెడ్డి

వేములవాడ, జూన్ 5: తెలంగాణ రాష్ట్ర విభజన తీరును వక్రీకరిస్తూ మాట్లాడిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్ లో శుక్రవారం ప్రారంభించగా ఆయన హాజరై మాట్లాడారు. 12 సంవత్సరాల క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర విభజనను మరోసారి వక్రీకరించి మాట్లాడడం సరికాదని అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జాగిరే తెలంగాణ రాష్ట్రమని పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులుఆవేశానికి కేరాఫ్ గా నిలిచిన పవన్ కళ్యాణ్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు లాంటి మేధావుల పై ఆంధ్రప్రదేశ్ లో కేసులు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని



చూస్తున్నారని అన్నారు. ఎన్డీఏ కూటమి కూడా తెలంగాణలో అడుగుపెట్టేందుకు చూస్తుందని ఇందులో భాగంగానే పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు అర్థం చేసుకోవచ్చు అని కూడా అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బేశరత్తుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ పాలనలో సామాజిక న్యాయం పూర్తిగా కొరబడిందని మండిపడ్డారు.ఎన్నికలు వచ్చిన ప్రతి సందర్భంలో ఎట్లా గెలవాలనే దానిపైన దృష్టి ఉంది కానీ రాజ్యాంగంలోని ప్రజలకు కావాల్సిన కూడు, గూడు, నీడ, విద్య, వైద్యం విధానంలో ప్రభుత్వం పనిచేయడం లేదని విమర్శించారు. దేశంలోని సంపద నలుగురు దగ్గరే మూలుగుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి జిల్లాల సిపిఐ జిల్లా కార్యదర్శిలు సుదర్శన్, శ్రీనివాస్, సదానందం, విశ్వనాథం, రాష్ట్ర నాయకులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, శంకర్, నాయకులు వేణు, రాములు తదితరులు ఉన్నారు.

# పుప్పాలగూడలో హైడ్రా భారీ ఆపరేషన్

### 200 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్
### రూ. 30 వేల కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రాహైకోర్టు తీర్పు మేరకు హైడ్రా రక్షణ చర్యలు
### 250 కోట్ల సంవత్సరాల చరిత్రను కాపాడిన హైడ్రాప్రపంచ పర్యావరణ దినోత్సవానికి హైడ్రా నీరాజనం

హైదరాబాద్, జూన్ 05: ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ప్రకృతిని పరిరక్షిస్తూ చారిత్ర రాళ్ల గుట్టలతో పాటు.. ఆతి పురాతన రాతి గుహలు, వాటి మధ్యన ఉన్న చెట్టూ.., చేమను హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ - ఖాజాగూడ సరిహద్దుల్లో శుక్రవారం 198 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 250 కోట్ల సంవత్సరాల చారిత్రక రాళ్ల గుట్టలు కూడా ఉన్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ ఎం డీ ఏకు కేటాయించిన 200ల ఎకరాలు కూడా ఉన్నాయి. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ దశాబ్దాలుగా సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు పోరాడుతున్నారు. హైకోర్టును కూడా వీరు ఆశ్రయించారు. ఈ మేరకు రాతి గుట్టలతో పాటు.. ప్రభుత్వ భూమిని కాపాడాలని 2019లో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు హైకోర్టు ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడం జాప్యం కావడంతో కబ్జాలకు ఆస్కారం ఇచ్చినట్టయ్యింది. ఇదే విషయాన్ని సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో గతంలోనే పరిశీలించారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని శుక్రవారం ఫెన్సింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ భూమి విలువ రూ. 30వేల కోట్లు వరకూ ఉంటుందని అంచనా.× రెవెన్యూ రికారక్డుల మేరకు..సర్వే నంబరు 452/1 లో 174 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అలాగే 454/1 సర్వే నంబరులో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మొత్తం 293.05 ఎకరాలు కాగా.. ఇందులో 263.05 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ ఎండీఏకు కేటాయించింది. రెండు గ్రామాల మధ్య ఓవర్‌ల్యాప్ ఇష్యూలతో 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో హెచ్ ఎం డీఏకు 200ల ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇవే చారిత్రక గుట్టల ప్రాంతంలో వివిధ దేవాలయాలకు 5 ఎకరాలు కేటాయించగా.. దర్గాకు 5 ఎకరాలు అప్పజెప్పినట్టు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఇలా ఎవరికి కేటాయించిన భూములు పోగా.. 200 ఎకరాల హెచ్ ఎం డీ ఏ భూమిని హైడ్రా శుక్రవారం కాపాడింది. సొసైటీ టూ సేవ్ రాక్స్ ప్రతినిధులు కోరిన విధంగా అక్కడ చారిత్రక బండ రాళ్లను కూడా హైడ్రా కాపాడినట్టయ్యింది.

# ఎలక్ట్రిక్ బస్సుల్లో ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్)హైదరాబాద్ మహానగరంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య రోజురోజుకూ విస్తరిస్తుండటంతో, ఉపాధి కోసం నగరానికి వచ్చే యువతకు సరికొత్త అవకాశాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం మియాపూర్, కంటోన్మెంట్, హెచ్‌సీయూ, హయాత్‌నగర్, రాణిగంజ్ డిపోల పరిధిలో నడుస్తున్న 440 ఎలక్ట్రిక్ బస్సుల కోసం నిబంధనల ప్రకారం సుమారు 1100 మంది డ్రైవర్లను నియమించారు. వీరిలో అత్యధికులు సంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి పొరుగు జిల్లాల నుండి వచ్చిన వారే కావడం విశేషం. ఉపాధి లభించడంతో వీరంతా కూకట్‌పల్లి, బాలానగర్, ఉప్పల్, ఎల్బీనగర్, మియాపూర్ డిపోల పరిసర ప్రాంతాల్లోనే తమ కుటుంబాలతో కలిసి స్థిరపడ్డారు.ఇటీవల కూకట్‌పల్లి డిపోలో కొత్తగా ప్రారంభించిన 60 బస్సుల కోసం నియామక ప్రక్రియ చేపట్టగా, మరో 150 మందికి ఉపాధి లభించింది. రాబోయే రెండు సంవత్సరాలలో గ్రేటర్ పరిధిలోకి 2 వేలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే డ్రైవింగ్ రంగంతో పాటు ఇతర విభాగాలలో దాదాపు మరో 5 వేల మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.ఈ ఉద్యోగాలకు ఎంపిక కావాలంటే అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండటంతో పాటు, డ్రైవింగ్‌లో కనీసం 18 నెలలు లేదా అంతకంటే ఎక్కువ అనుభవం తప్పనిసరి. అర్హత సాధించిన డ్రైవర్లకు హకీంపేట కేంద్రంలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఎంపికైన వారికి జిల్లాలతో పోలిస్తే మెరుగైన జీతం, జీరో యాక్సిడెంట్ అలవెన్స్ , ఇతర సదుపాయాలు కల్పిస్తుండటంతో ప్రవాసులు ఇక్కడే స్థిరపడటానికి ఆసక్తి చూపుతున్నారు. ఇతర విభాగాలలోనూ అవకాశాలు..వలం డ్రైవర్లు మాత్రమే కాకుండా టెక్నీషియన్, మెకానిక్, ఛార్జింగ్ స్టేషన్ ఆపరేటర్, మేనేజ్‌మెంట్ (నిర్వహణ) విభాగాలలో కూడా పెద్ద సంఖ్యలో కొలువులు లభిస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులకు ప్రత్యేకమైన బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు ఉంటాయి. కాబట్టి ఈ తరహా వాహనాల సర్వీసింగ్‌లో నైపుణ్యం ఉన్న నిపుణులకు మార్కెట్లో ప్రాధాన్యత , జీతాలు పెరుగుతున్నాయి.గ్రేటర్ పరిధిలోని ఆరు డిపోలలో ఇప్పటికే ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, రాబోయే రోజుల్లో మరిన్ని డిపోలలో ఈ వసతులను విస్తరించనున్నారు. ఈ మౌలిక సదుపాయాల కల్పన , పర్యవేక్షణ కోసం అనుభవజ్ఞులైన నిపుణులను ఆర్టీసీ అధికారులు నియమించుకుంటున్నారు.

# గ్రేటర్ ఎన్నికల్లో కూటమి..?

హైదరాబాద్, జూన్ 5, (న్యూస్ పల్స్)తెలంగాణలో కొన్ని రోజులుగా పవన్ కల్యాణ్ చుట్టూ రాజకీయాలు నడుస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు జనసేన తెలంగాణ రాష్ట్ర శాఖ నవ నిర్మాణ సభ ఏర్పాటు చేసింది. దానికి పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ను ఆహ్వానించింది. అయితే అంతకుముందే నాగేశ్వర్ ఇష్యూ నడుస్తూ ఉండడం, ఇరు పక్షాల మధ్య వాదోపవాదనలు బలంగా నడుస్తూ ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సభకు పర్మిషన్ ఇవ్వలేదు. అటు హైకోర్టు కూడా ఈ సమావేశానికి అనుమతి నిరాకరించింది.అదే రోజు పవన్ కల్యాణ్ తన ఇంట్లో ప్రెస్ మీట్ పెట్టి ఆవేశంగా మాట్లాడారు. తనను తెలంగాణలో అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరిస్తున్నారని, ఇదేమైనా వాళ్ల అయ్య జాగీరా అని ప్రశ్నించారు. ఇన్నాళ్లూ తెలంగాణపై దృష్టి పెట్టాలనే ఆలోచన రాలేదని, కానీ తెలంగాణలో కూడా పోటీ చేయాలని ఇప్పుడు నిర్ణయించుకున్నానని ప్రకటించారు. ఈ ప్రకటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.పవన్ కల్యాణ్ తెలంగాణపై ఫోకస్ చేయడం వెనుక కాంగ్రెస్ హస్తం ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. రేవంత్ రెడ్డి కోసమే పవన్ కల్యాణ్ ఇలా పని చేస్తున్నారని చెప్తోంది. అయితే పవన్ కల్యాణ్ పై యుద్ధ భేరి మోగించారు కాంగ్రెస్ నేతలు. బీఆర్ఎస్ కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలే పవన్ కల్యాణ్ పై నోరు పారేసుకుంటున్నారు. జనసైనికుల్లో ఆగ్రహం రావడానికి కాంగ్రెస్ నేతల మాటలే కారణం.అయితే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి లబ్ది చేకూర్చేందుకే పవన్ కల్యాణ్ ఎంట్రీ ఇస్తున్నారని కొంతమంది అంచనా వేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సీమాంధ్ర ఓటర్లు పెద్ద ఎత్తున ఉన్నారు. ఇన్నాళ్లూ వాళ్లంతా బీఆర్ఎస్ వైపు నడిచారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి వాళ్ల ఓట్లను రాబట్టుకునేందుకు గట్టిగా ట్రై చేస్తున్నారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కూడా చేశారు. అయితే సీమాంధ్ర ఓట్లను పవన్ కల్యాణ్ చీల్చ గలిగితే బీఆర్ఎస్ ఎక్కువగా నష్టపోతుందని అంచనా వేస్తున్నారు. ఆ ఓట్లు పవన్ కల్యాణ్ పార్టీ లాక్కోగలిగితే, అంతిమంగా అది బీజేపీకి మేలు చేసే అవకాశం ఉండొచ్చని భావిస్తున్నారుబీజేపీ ఇప్పటికే తాము ఒంటరిగానే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని ప్రకటించింది. ఒకవేళ జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తే సీమాంధ్ర ఓటర్లు పెద్దఎత్తున ఆ కూటమి వైపు మళ్లొచ్చు. అప్పుడు బీఆర్ఎస్ ఎక్కువ నష్టపోతుంది. కాంగ్రెస్ కొంతమేర కోల్పోవచ్చు. ఈ చీలికలో బీజేపీకి లబ్ది చేకూరవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీజేపీకి లబ్ది చేకూర్చేందుకే పవన్ కల్యాణ్ తెలంగాణపై కన్నేశారని భావిస్తున్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం

## సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి.

పరవాడ.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరవాడ ఫార్మాసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో పర్యావరణాన్ని కాపాడుకుందాం, పర్యావరణాన్ని పరిరక్షించండి నినాదాలు చేస్తూ ఐఓసీ జంక్షన్ నుండి టొరంటో ఫార్మా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రకృతిపై మనకి ఎంత హక్కు ఉందో దీనిని పరిరక్షించవలసిన బాధ్యత కూడా అంతకుమించి ఉందని ప్రకృతి స్ఫూర్తితో, వాతావరణం కోసం, మన భవిష్యత్తు కోసం ప్రజలంతా ప్రకృతిని కాపాడాలని కాపాడుకోవడానికి మనం అందరం ఉద్యమించాలని గని శెట్టి పిలుపునిచ్చారు. పరవాడ ఫార్మా పరిశ్రమల నుండి విడుదల అవుతున్న వ్యర్థ రసానికి జలాలను చెరువుల్లోకి కాలువల్లోకి గడ్డల్లోకి విడుదల చేయడం వలన భూగర్భ జలాలను నాశనం అవుతున్నాయని మరోవైపు అనేక జీవరాసులు కాలుష్యం వలన నాశనం అవుతున్నాయని దీని కాపాడవలసిన ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలను గాలికి వదిలేస్తున్నారని గని శెట్టి అన్నారు. సముద్రంలో ఏ విధమైన శుద్ధి చేయకుండా ఫార్మా గద్ద రసాన్నిక జలాలను విడుదల చేయడం వలన సముద్రంలో విలువైన జీవరాసులు నాశనం అవుతున్నాయని దీని పరిరక్షించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు సక్రమమైన పద్ధతుల్లో పర్యవేక్షణ లేకపోవడం వలన ఢిల్లీ తర్వాత భారతదేశంలో పరవాడ ప్రాంతం తీవ్రమైన కాలుష్యంలో చిక్కుకున్నదని ఉందని గని శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఫార్మా పరిశ్రమలో ప్రతి ఆరు నెలలకి ఆడిట్ నిర్వహించాలని గని శెట్టి డిమాండ్ చేశారు.

# 'ప్రభుత్వం నుండి బిల్లులు రాక ఆగుతున్న గుత్తేదారుల గుండెలు'



ఖమ్మం రూరల్, జూన్ 05 : రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది గుత్తేదారులకు వేలకోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడం ద్వారా ఇప్పటికే అనేకమంది కాంట్రాక్టర్లు, బిల్డర్స్ అసోసియేషన్ నాయకుల గుండెలు ఆగిపోయాయని సత్వర పరిష్కారం కోసమే చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వడం జరిగిందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు, కాంట్రాక్టర్లు తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బి ఏ ఐ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డివిఎన్ రెడ్డి రాష్ట్ర చైర్మన్ శ్రీనివాసరావు, సెక్రెటరీ పవన్ కోశాధికారి సంతోష్ రెడ్డి, కిసాన్ శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా సెంటర్ చైర్మన్ కిశోర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంట్రాక్టర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొద్ది సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిమంది గుత్తేదారులకు మాత్రమే బిల్లులు అందుతున్నాయని, ఆది నుండి

**ఉపాధి లేక కార్మికుల కుటుంబాల అవస్థలు**
**సమస్య తీవ్రత తెలిపేందుకే చలో హైదరాబాద్**
**రాష్ట్ర వ్యాప్తంగా రూ.20 వేల కోట్ల పెండింగ్ బకాయిలు**
**విలేకరుల సమావేశంలో బీఏఐ రాష్ట్ర నేతలు, కాంట్రాక్టర్లు వెల్లడి**

నిర్మాణ పనులు చేసిన వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.దీంతో గతంలో వందల కోట్లు కలిగిన కాంట్రాక్టర్లు నేడు రూ.10, 20 కోట్ల టర్నోవర్‌కే పరిమితమవుతున్నారన్నారు. తద్వారా వారిని నమ్ముకున్న అనేకమంది స్కిల్డ్, నాన్ స్కిల్డ్ కార్మికులు, వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ద్వారా ఇప్పటికే అనేకమంది గుండెపోటుతో మరణించగా, మరికొంతమంది ఆత్మహత్యలకు సైతం పాల్పడడం జరిగిందన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, చేసిన పనులకు ఫస్ట్ క్లారిటీ చొప్పున పెండింగ్ బిల్లుల చెల్లింపు విధానం అమలు చేయాలన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఇష్టారీతిన బిల్లుల చెల్లింపు చేస్తున్నారని, ఈ విషయాన్ని తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి సమాచారం రావడం లేదన్నారు. చెల్లింపు విధానాలను వెబ్‌సైట్ ద్వారా చూడకుండా సదర్ సైట్లను సైతం క్లోజ్ చేయడం బాధాకరమన్నారు. నేటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సుమారు రూ.20 వేల కోట్లు చెల్లించాల్సి ఉ ందన్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్టర్లు బిల్లుల కోసం బిక్షగాండ్లుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులువిధిలేని పరిస్థితిలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బిల్లుల చెల్లింపునకై ఈ నెల 18న చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వైఖరి మార్చుకుని కాంట్రాక్టర్ల ఇబ్బందులను పరిగణలకు తీసుకుని పెండింగ్ బిల్లులను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బిల్డర్స్ అసోసియేషన్, వివిధ శాఖలకు చెందిన గుత్తేదారులు, వారి సిబ్బంది కదిలి రావాలని పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమం అనంతరం ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాని ఎడల దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుత్తేదారులు గరికపాటి వెంకటేశ్వరరావు, రామకృష్ణరెడ్డితో పాటు పలువురు ఉమ్మడి జిల్లాకు చెందిన గుత్తేదారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి-కవిత

హైదరాబాద్,అమీర్ పేట్ మైత్రివనం ఎదురుగా అగ్నిప్రమాదం జరిగిన షాపింగ్ కాంప్లెక్స్ ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగే పరిస్థితి ఉ ందని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని కవితకు బాధితులు వివరించారు.కవిత మాట్లాడుతూ మీర్ పేట్ లో జరిగిన అగ్నిప్రమాదం సడెన్ గా జరిగింది కాదు. వెనుక వైపు ఉన్న మెస్ కారణంగా గతంలో షార్ట్ సర్క్యూట్ జరిగిందని చెబుతున్నారు. అగ్ని ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయని మూడు నెలలుగా అధికారులకు చెబుతూనే ఉన్నారు. కానీ అధికారులు



నిర్లక్ష్యం చేయటం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. అగ్నిప్రమాదం కారణంగా దాదాపుగా మూడు నుంచి నాలుగు కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగింది. ప్రమాదం జరిగిన గంట పావు వరకు కూడా ఫైరింజన్లు రాకపోవటం దారుణం. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఆలోచన చేయాలి. సరైన సమయానికి ఫైరింజన్లు వచ్చి ఉంటే ఆస్తి నష్టం చాలా వరకు తగ్గేది. ప్రమాదం జరిగిన షాప్ వాళ్లందరికీ కూడా ఎన్ఓసీ లు ఉన్నాయి. వాళ్లందరికీ నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. హైడ్రా వాళ్లు వచ్చి ఇన్ స్పెక్షన్ చేశారని చెబుతున్నారు. ఈ ఏడాది ఎండకాలంలో అగ్నిప్రమాదాలు జరగకుండా చేపట్టిన చర్యల కారణంగా మంచి ఫలితాలు వచ్చాయి. కానీ ఇంకా కూడా సీరియస్ గా ఈ అంశంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అదృష్టవశాత్తు ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదు. ఇలాంటి ప్రమాదాలు ఎప్పుడైనా జరగవచ్చు. కనుక అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇలాంటి బిల్డింగ్ ఉన్న చోట ఇన్ స్పెక్షన్ చేయాలని అన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్‌ను సందర్శించిన హీరోషిమా ప్రతినిధుల బృందం



హైదరాబాద్ : జపాన్ దేశం హీరోషిమా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం తెలంగాణ శాసన మండలి, శాసన సభను సందర్శించారు. ఈ సందర్భంగా శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ వారికి స్వాగతం పలికారు. మండలి ఛైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని వివరించారు.తెలంగాణ రాజధాని నగరంలో అన్ని దేశాలకు చెందిన ప్రజలు జీవిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి విప్‌లు అద్దంకి దయాకర్ , వెంకట నర్సింగరావు , ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్ , అంజి రెడ్డి , ఎమ్మెల్యేలు టి రామ్మోహన్ రెడ్డి , పాల్వాయి హరీష్ , శాసన మండలి సెక్రెటరీ డా. నర్సింహాచార్యులు , శాసన సభ సెక్రెటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సభ ఎంపీగా పోటీ చేయనున్న మమత..

### అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కీలక నిర్ణయం

పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ లోక్‌సభపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ ఘోర ఓటమి తర్వాత ఆమె చూపు పార్లమెంట్‌వైపు పడినట్లు సమాచారం. దీంతో త్వరలోనే ఆమె లోక్‌సభకు పోటీ చేయనుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం పాలై, అధికారం కోల్పోయింది. మమతా బెనర్జీయే అసెంబ్లీ సీటును గెల్చుకోలేకపోయింది.అటు



పార్టీ పరాజయం, ఇటు తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉండటం కంటే ఢిల్లీయే బెటర్ అని మమతా భావిస్తోంది. అందుకే పార్లమెంట్‌వైపు చూస్తున్నారు. లోక్‌సభకు తిరిగి ఎంపీగా వెళ్లాలనుకుంటున్నారు. అయితే, ఇప్పుడేమీ ఎన్నికలు లేవు. ఉప ఎన్నికలూ లేవు. మరెలా..? దీనికి సమాధానం ప్రస్తుతం టీఎంసీ తరఫున ఎంపీగా కొనసాగుతున్న యూసుఫ్ పఠాన్. మాజీ క్రికెటర్ అయిన యూసుఫ్ పఠాన్ 2024లో జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని బహరాంపూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన టీఎంసీ తరఫున లోక్‌సభ ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ అగ్రనేత అధిర్ రంజాన్ చౌదరిని భారీ మెజారిటీతో ఓడించారు.అయితే, ఇప్పుడు ఆ స్థానం నుంచి మమత పోటీ చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం ఆ సీటు నుంచి రాజీనామా చేయాలని యూసుఫ్ పఠాన్‌కు మమత సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి ఆయన కూడా సానుకూలంగానే ఉన్నారని తెలుస్తోంది. ఇదే జరిగితే, అక్కడ జరిగే ఉప ఎన్నికలో టీఎంసీ తరఫున మమతా బెనర్జీ పోటీ చేస్తారు. మమతా బెనర్జీ గతంలో కూడా ఎంపీగా పనిచేశారు. 1974 నుంచి ఆరుసార్లు కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 1984లో తొలిసారి జాధవ్‌పూర్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. అనంతరం 1989లో ఓడిపోయారు.తర్వాత కోల్‌కతా సౌత్ (ప్రస్తుతం కోల్‌కతా దక్షిణ్) నియోజకవర్గం నుంచి 1991, 1996లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆమె కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి, సొంత పార్టీ టీఎంసీని స్థాపించారు. 1998, 1999, 2004, 2009లో ఎంపీగా గెలిచారు. మరి యూసుఫ్ పఠాన్ రాజీనామా చేస్తే ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుస్తారా లేదా అనేది చూడాలి.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శిశు మందిర్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ పంపిణీ

కరీంనగర్ ,ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పండ్ల మొక్కలను నాటి, స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి, పర్యావరణ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆచార్యులు విద్యార్థులకు సూచించారు."ఒక్క విద్యార్థి ? ఒక్క మొక్క" అనే నినాదంతో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో ఈ సీడ్ బాల్స్‌ను ఖాళీ ప్రదేశాల్లో వేయడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చుని, ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశం "క్లైమేట్ ఆక్షన్ –నౌ ఫర్ క్లైమేట్ " అని పేర్కొంటూ, భూమిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, పర్యావరణ పరిరక్షణను వ్యక్తిగత బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, డీవైఎస్‌వో ఉట్కూరు శ్రీనివాస్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెల్దండి దామోదర్, బైరి శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, సంపత్, సూర శివశంకర్, నాగరాజు, పాఠశాల కమిటీ సభ్యులు కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, పులాల శ్యామ్, తాటి రాజేశ్వర్‌రావు, రాపర్తి శ్రీనివాస్, నడిపెల్లి దీన్‌దయాల్, అప్పిడి వకులదేవి, ఆచార్య బృందం, విద్యార్థులు మరియు పలువురు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం : హరీశ్ రావు


హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో 07-04-2026 నాడు లేఖ రూపంలో బీఆర్ఎస్ చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. అందువల్లే నేడు పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందారన్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులుకృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ కనిష్ఠ స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ 74 శాతం వినియోగిస్తే, తెలంగాణ 25 శాతానికే పరిమితమైందని పేర్కొన్నారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తు ప్రమాదంలో పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు ఉందని హెచ్చరించారు.అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని, కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులు కాపాడాలి అంటూ రేవంత్ రెడ్డికి లేఖ రాసిన లేఖలో హరీశ్ రావు పేర్కొన్నారు.



## కాంగ్రెస్‌కు జేఎంఎం ఝలక్..

### రెండు రాజ్యసభ సీట్లలో పోటీకి కసరత్తు

రాంచీ: జార్ఖండ్‌లోని 'ఇండియా' కూటమిలో తాజాగా విభేదాలు పొడచూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్ఖండ్ నుంచి రెండు రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, రాష్ట్రంలో జేఎంఎం భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ ఒక సీటును ఆశిస్తోంది. పార్టీ నుంచి పోటీ చేసే రాజ్యసభ అభ్యర్థి పేరును ఇప్పటికే ప్రకటించింది. అయితే రెండు రాజ్యసభ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు జేఎంఎం తాజాగా నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. దీనిపై భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు తలెత్తే అవకాశాలున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై జేఎంఎం శాసనసభ్యులు, మంత్రులు, ఎంపీలు, సీనియర్ నేతలు శు క్రవారంనాడు సమావేశమయ్యారు. ఖాళీగా ఉన్న రెండు సీట్లలోనూ జేఎంఎం పోటీ చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయం కుదరినట్టు సమావేశానంతరం రాష్ట్ర మంత్రి యోగేంద్ర మెహతో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కే అప్పగించినట్టు వివరించారు. ఈ క్రమంలో రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు భాగస్వామ్య పార్టీలతో సోరెన్ సంప్రదింపులు చేపట్టనున్నట్టు తెలుస్తోంది.కాగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే జార్ఖండ్ నుంచి పోటీ చేసే అభ్యర్థితో పాటు ఏడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. భాగస్వామ్య పక్షంగా తమకు ఒక సీటును జేఎంఎం కేటాయిస్తుందనే అభిప్రాయంతో కాంగ్రెస్ ఉంది. రెండు సీట్లూ తమకే కావాలని జేఎంఎం పట్టుపడితే దీనిపై రాబోయే రోజుల్లో ఇరుపార్టీల మధ్య ముమ్మరంగా సంప్రదింపులు జరిగే అవకాశాలు ఉన్నాయి.వివిధ రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరుగనున్నాయి. జార్ఖండ్‌లో చాలాకాలంగా జేఎంఎం, కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి. సోరెన్ నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో కూడా ఉంది. రెండు రాజ్యసభ సీట్లు ఆశించడం ద్వారా జార్ఖండ్ రాకీయాల్లో తమ బలం చెక్కుచెదరకూడదని జేఎంఎం భావిస్తుండగా, కూటమి ప్రభుత్వంలో తాము రాజకీయ ప్రాధాన్యం కోల్పోరాదని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది.



## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు కృషి చేయాలి..

### కంబాల ఆదేశాల మేరకు మొక్కలు నాటిన బీజేపీ శ్రేణులు.

గోకవరం , ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా, మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఏక్ పేడ్ మా కే నామ్, ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటలానే కార్యక్రమంలో భాగంగా విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ వద్ద, తంటికొండ, ఇందుకూరు పేట వెళ్లే రహదారి ఇరువైపులా, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామసేన సభ్యులు బీజేపీ నాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడం, పర్యావరణాన్ని కాపాడటం మన బాధ్యతగా భావిద్దమ్మన్నారు. అందరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలి సూచించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, కరిబండి వెంకటేశ్వరరావు, పసల గణేష్, పెద్దాడ వెంకన్న దొర, దేశాల నరేష్, బత్తిన వీరాంజనేయులు, నాగ రమేష్, వీరాంజలి, చింతల కన్నారావు, అన్నం చెల్లరావు, కందికట్ల మూర్తి, తుమ్మల బుజ్జి, పదిలం చక్రరావు, కంబాల త్రిమూర్తులు, కేబుల్ రాజు, నెల్లి శ్రీను, మండే గౌతమ్, ధార శ్రీను, బాతు ఆనంద్, పిల్లి హర్ష, సోషల్ మీడియా కన్వీనర్ ఆదం మణికంత, మురళి, కిషోర్, దళిత యువత తదితరులు పాల్గొన్నారు...

## రోడ్డు ప్రమాదంలో బిటెక్ విద్యార్థి మృతి

సికింద్రాబాద్,జలమండలి కార్యాలయం వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కింద పడి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు.జూబ్లీ బస్ స్టేషన్ నుండి ఉప్పల్ కు వెళ్తున్న క్రమంలో ఘటన చోటుచేసుకుంది.గురునానక్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విశాల్ మదన్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో కొద్దిపాటి వర్షానికి రహదారి తడవడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బస్సు కిందికి వెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన విశాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

# గ్లోబల్ సిటీగా ఆంధ్రా

విజయవాడ జూన్ 5, ఇప్పటివరకు ఐటీ రంగం అత్యధిక ఉద్యోగాలను కల్పిస్తోంది. ఏపీ సరికొత్త మైలురాళ్లు అందుకునేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే గూగుల్ నుంచి మొదలు పెడితే పెద్దపెద్ద కంపెనీల వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. భారీగా కార్యకలాపాలను సాగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఇక్కడితోనే ఏపీ పారిశ్రామిక ప్రస్థానం ఆగిపోవడం లేదు. అంతకుమించి అనేలాగా ఏపీ మంత్రి నారా లోకేష్ అడుగులు వేస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఐటీ రంగానికి విశేషమైన ప్రాధాన్యం ఇచ్చారు. పెట్టుబడులు పెట్టే విధంగా కంపెనీలకు ప్రోత్సాహకాలు కల్పించారు. ఆయన కల్పించిన స్వేచ్ఛాయుతమైన వాణిజ్య విధానం నేడు హైదరాబాద్ నగరాన్ని మన దేశానికి రెండవ ఐటి రాజధానిగా చేసింది. విభజిత ఆంధ్ర ప్రదేశ్ లో కూడా ఐటీ రంగానికి విశేషమైన ప్రాధాన్యం ఇస్తున్నారు చంద్రబాబు. ఈ క్రమంలో దేశీయంగా పేరుపొందిన కంపెనీలు పెట్టుబడులు పెట్టే విధంగా రూపకల్పన చేస్తున్నారు. గూగుల్ నుంచి మొదలు పెడితే టిసిఎస్ వరకు పెద్ద పెద్ద కంపెనీలు ఆంధ్రప్రదేశ్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఐటీరంగం తీవ్రంగా ప్రభావితం అవుతుంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియడం లేదు ఈ నేపథ్యంలో కొత్త ఆలోచన చేశారు ఏపీ మంత్రి నారా లోకేష్. తన తండ్రి మాదిరిగానే వినూత్నంగా ఆలోచించి.. ఏపీ రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారు. నారా లోకేష్ ప్రస్తుతం రష్యాలో పర్యటిస్తున్నారు. అక్కడ అనేక రకాల కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. ఏపీలో ఉన్న పరిస్థితుల గురించి.. పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న విధానాల గురించి వెల్లడించారు. ఇక్కడితోనే నారా లోకేష్ ఆగిపోలేదు. ఏకంగా స్పేస్ పాలసీ గురించి వెల్లడించారు. తమ రాష్ట్రానికి స్పేస్ పాలసీ అనేది ఒకటి ఉందని.. తద్వారా రెండు ప్రత్యేకమైన స్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నామని నారా లోకేష్ వివరించారు. రష్యాలోని ఎస్పీఐఎఫ్ వేదికగా జరుగుతున్న సదస్సులో ఆయన మాట్లాడారు.. స్పేస్ సిటీల ద్వారా 25వేల కోట్ల పెట్టుబడులు.. 5000 మందికి ప్రత్యక్షంగా.. 30 వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు అందిస్తామని ఆయన ప్రకటించారు.. అంతరిక్షంలో ప్రయోగాలు చేసే వాహనాలకు సంబంధించిన అసెంబ్లింగ్.. ఉపగ్రహాల తయారీ.. ఇతర పరికరాల కోసం తిరుపతి సమీపంలో దాదాపు 2,800 ఎకరాల విస్తీర్ణంలో స్పేస్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని నారా లోకేష్ వివరించారు. ఇప్పటికే రాయల్ ఎన్ఫీల్డ్ రాయలసీమలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. కియా పరిశ్రమ రాయలసీమ ముఖ చిత్రాన్ని మార్చేసింది. ఇంకా అనేక రకాల పరిశ్రమలు రాయలసీమలో ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పుడు స్పేస్ సిటీ ద్వారా రాయలసీమలో ప్రధాన పట్టణమైన తిరుపతికి సరికొత్త గుర్తింపు రానుంది. ఆధ్యాత్మిక ప్రాంతంగా ప్రపంచ స్థాయి పేరు తెచ్చుకున్న తిరుపతి.. ఇప్పుడు పారిశ్రామికపరంగా కూడా సరికొత్తగా గుర్తింపును అందుకోనుంది. పారిశ్రామికంగా ఒక రాష్ట్రం బాగుంటే పెట్టుబడులు బాగా వస్తాయి.

ఆ రాష్ట్రానికి గ్లోబల్ గుర్తింపు తీసుకొస్తే పెట్టుబడులకు ఇబ్బంది ఉండదు. అందువల్లే నారా లోకేష్ దూకుడు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఆయన విదేశాలలో పర్యటిస్తూ.. పెద్దపెద్ద కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతూ.. వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించే విధంగా ఒప్పిస్తున్నారు. గతంలో దావోస్ లో పర్యటించిన నారా లోకేష్.. అనేక కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. ఎం ఓ యు లు కుదుర్చుకున్నారు. ఫలితంగా ఆ కంపెనీలు ఏపీ రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఇటీవల రాయల్ ఎన్ఫీల్డ్ వంటి కంపెనీ ఏపీలో పెట్టుబడులు పెట్టింది. రాయలసీమలో వాహనాల తయారీని చేపడుతోంది. గతంలోని రాయలసీమ ప్రాంతంలో కియా పరిశ్రమ ఏర్పాటు అయింది. ఇప్పుడు నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆ దేశ వ్యాపారవేత్తలతో సమావేశం అయ్యారు. మైక్రో ఎలక్ట్రానిక్స్ విభాగంలో పేరుపొందిన ఎలిమెంట్ గ్రూప్.. అల్యూమినియం ఉత్పత్తులు తయారుచేసే రూసాల్.. కెమికల్ ఉత్పత్తులు తయారుచేసే రస్కెమ్ వంటి కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తమ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలని వారిని ఆహ్వానించారు. వారితో సుదీర్ఘ సమయం సమావేశం నిర్వహించిన లోకేష్.. ఏపీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అనుకూలమైన పరిస్థితుల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడిల ప్రోత్సాహక అనుమతుల గురించి వివరించారు. ఆ తర్వాత మాస్కో ట్రాన్స్పోర్ట్ డెవలప్మెంట్ సెంటర్ ను లోకేష్ సందర్శించారు. అక్కడి రవాణా వ్యవస్థ నిర్వహణపై స్థానిక అధికారులను ప్రశంసించారు. ఏపీ రాష్ట్రంలో కూడా ఇటువంటి విధానాన్ని అమలులోకి తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు.

# వైసీపీలో సీట్ల లొల్లి...



విజయవాడ, జూన్ 5, (న్యూస్ పల్స్)వైసీపీలో టిక్కెట్ల రగడ ఇప్పటి నుంచే మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు పూర్తయి రెండేళ్లు పూర్తి కావస్తుండటం, స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండటంతో జగన్ తో ముందుగానే టిక్కెట్ ఖరారు చేయించుకోవాలని నేతలు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖర్చు చేయాలంటే తమకు వచ్చే ఎన్నికలలో టిక్కెట్ హామీ ఇవ్వాల్సిం?దనని కొందరు పట్టుబడుతున్నారు. ఈ విషయాన్ని నేరుగా జగన్ తో చెప్పలేకపోయినా.. సజ్జల వంటి వారితో చెప్పి తమ మనసులో మాటను చెప్పుకుంటున్నారు. అలాగయితేనే తాము స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖర్చు చేస్తామన్న షరతును కూడా కొందరు పెడుతున్నట్లు సమాచారంస్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి నిలవాలన్న ప్రయత్నంలో ఉన్నారు. తమకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నలభై శాతం ఓటు బ్యాంకును అలాగే పదిలపర్చుకోవాలంటే లోకల్ బాడీ ఎన్నికల్లో పోటీ చేసి తీరాలని, అందుకు సరైన అభ్యర్థులను ఎంపిక చేయాలని కూడా జగన్ సూచించినట్లు తెలిసింది. అయితే రిజర్వ్ డ్ పంచాయతీలు, వార్డులు, డివిజన్లతో పాటు ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారికి అండగా నిలవాలని కూడా నియోజకవర్గ ఇన్ ఛార్జులకు జగన్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. దీంతో తాము ఖర్చు చేయాలంటే తమకు టిక్కెట్ హామీ ఇవ్వాలని జగన్ కు షరతు విధిస్తున్నారని తెలిసింది. వైసీపీలో చివరి వరకూ టిక్కెట్ ఖరారు అవ్వడం కష్టమే. అనూహ్యంగా కొత్త అభ్యర్థులు తెరపైకి తీసుకు వచ్చే అలవాటు జగన్ కు ఎప్పటి నుంచో ఉంది. అదే భయం. 2014 ఎన్నికల నుంచి జగన్ అభ్యర్థుల ఎంపికలో అనేక విధానాలను పాటిస్తుండటం, కోరుకున్న వారికి సీటు దక్కకపోవడంతో ఈసారి తమకు టిక్కెట్ దక్కుతుందో లేదో? అన్న సందేహం నియోజకవర్గ ఇన్ ఛార్జుల్లో ఉంది. నియోజకవర్గ ఇన్ ఛార్జులయినంత మాత్రాన టిక్కెట్ ఇస్తారన్న గ్యారంటీ లేదు. అందువల్లనే ఇప్పుడే టిక్కెట్ హామీ ఇవ్వాలని, లేదంటే మరొకరికి పార్టీ ఇన్ ఛార్జి పదవి ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని కొందరు తెగేసి చెప్పినట్లు సమాచారం. మొత్తం మీద జగన్ మీద ఇప్పటి నుంచే నేతలు ప్రెజర్ తెస్తుండటంతో ఒకింత చర్చనీయాంశంగా మారింది. మూడేళ్లకు ముందే ఈ షరతులేంటి అని కొందరు పార్టీ అగ్రనేతలు విస్తుపోతున్నారట. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వ్యవహారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. అమరావతి ప్రాంతంలో పార్టీ తరఫున కార్యాచరణను పటిష్టం చేసేందుకు, అదే సమయంలో న్యాయపరమైన అంశాలను ఎదుర్కొనేందుకు వీలుగా రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. అమరావతి పరిధిలో రైతుల సమస్యలు, ప్రాంతీయ పరిణామాలను పర్యవేక్షించేందుకు 8 మంది సభ్యులతో కూడిన 'రైతు పరిరక్షణ కమిటీ'ని వైస్సార్సీపీ నియమించింది. ఈ కమిటీలో కమిటీలో వైస్సార్సీపీ సీనియర్ నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్, నందిగం సురేశ్, అప్పిరెడ్డి, అరుణ్ కుమార్, వజ్రబాబు సభ్యులుగా ఉన్నారుఇక అమరావతి రాజధాని వ్యవహారాలకు సంబంధించిన వివాదాలపై కోర్టులలో పార్టీ తరఫున వాదనలు బలంగా వినిపించేందుకు, చట్టపరమైన చర్యల కోసం లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక 'న్యాయపోరాట కమిటీ'ని కూడా నియామకం చేసింది. ఇందులో సభ్యులుగా పొన్నవోలు సుధాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కిషోర్ ఉంటారు. రాజధాని ప్రాంతంలో క్షేత్రస్థాయిలో రైతుల పక్షాన నిలబడటంతో పాటు, ఇటు న్యాయస్థానాల్లో కూడా గట్టిగా పోరాడేందుకు వీలుగా వైసీపీ ఈ వ్యూహాత్మక కమిటీలను ఏర్పాటు చేసినట్లుగా పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. చివరగా.. ఐదుగురు సభ్యులతో డీఎస్సీ పోరాట కమిటీని నియమించారు. ఇందులో సభ్యులుగా అప్పిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కల్పలత, చైతన్య, రవిచంద్ర ఉంటారని వైసీపీ రాష్ట్ర అధినాయకత్వ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

# రఘురామ వర్సెస్ సునీల్



## అట్రాసిటీ అస్త్రం - దళిత సెంటిమెంట్ రాజకీయం

భీమవరం, జూన్ 5, (న్యూస్ పల్స్) వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సీఐడీ చీఫ్‌గా వ్యవహరించి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్.. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును లక్ష్యంగా చేసుకుని చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఐపీఎస్ అధికారి అన్న హోదాను పక్కనబెట్టి సునీల్ కుమార్ విసురుతున్న రాజకీయ సవాళ్లు, దానికి రఘురామ ఇస్తున్న కౌంటర్లతో ఇరుపక్షాల మధ్య డైలాగ్ వార్ పీక్స్‌కు చేరింది. గత ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజు అరెస్ట్, ఆ తర్వాత జరిగిన కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పీవీ సునీల్ కుమార్.. ఇటీవల కాలంలో పూర్తిగా ఒక పొలిటికల్ లీడర్ అవతారమెత్తారు. రఘురామ గనుక తన డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి వస్తే.. ఆయనపై తాను పోటీ చేసి వేయి ఓట్ల మెజారిటీతో ఓడిస్తానని సునీల్ కుమార్ విసిరిన సవాల్ తీవ్ర దుమారం రేపింది. అయితే రఘురామ ఇప్పుడు రాజీనామా చేయరని, ఒకవేళ చేసినా సునీల్ కుమార్ నేరుగా వచ్చి పోటీ చేయరని అందరికీ తెలిసిన సత్యమే. కానీ, రఘురామకృష్ణరాజు అనే ఒక పెద్ద లీడర్‌ను బూచి గా చూపిస్తూ.. ఆ వివాదం ద్వారా తన పొలిటికల్ ఇమేజ్‌ను పెంచుకోవడమే సునీల్ కుమార్ అసలు వ్యూహమని భావిస్తున్నారు. ఈ వివాదంలో అత్యంత విచిత్రమైన, చట్టపరమైన తిరకాసు ఏమిటంటే.. పీవీ సునీల్ కుమార్ ఇంకా అధికారికంగా పోలీస్ సర్వీస్‌లోనే ఉన్నారు. సస్పెన్షన్‌లో ఉన్నప్పటికీ అఖిల భారత సర్వీస్ నిబంధనల ప్రకారం ఒక ఐపీఎస్ అధికారి ఇలా ప్రత్యక్ష రాజకీయ సవాళ్లు విసరడం, ప్రెస్ మీట్లు పెట్టడం నిబంధనలకు విరుద్ధం. అయితే, తాను సర్వీస్‌లో ఉన్నాననే విషయాన్ని కూడా పక్కనబెట్టి, నేరుగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న రఘురామతో రాజకీయ సవాళ్లు చేస్తున్నారు. భీమవరం వేదికగా జరిగిన దళిత సామాజికవర్గాల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు చూస్తే.. త్వరలోనే రిటైర్ అయిన తర్వాత నేరుగా వైఎస్ఆర్‌సీపీలో చేరి రఘురామపై పోరాడతాననే బలమైన సంకేతాలను ఇస్తున్నారు. ఈ రాజకీయ వివాదానికి పీవీ సునీల్ కుమార్ దళిత సెంటిమెంట్‌ను, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల అంశాన్ని జోడించడం ద్వారా మైలేజ్ సాధించాలని చూస్తున్నారు. దళితుల రక్షణ కోసమే తాను నిలబడ్డానని, తాను సీఐడీ చీఫ్‌గా ఉన్నప్పుడు దాదాపు 4,000 ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఛార్జ్‌షీట్లు వేయించానని సునీల్ కుమార్ ప్రకటించుకున్నారు. రఘురామతో ఉన్న పాత గొడవను కేవలం వ్యక్తిగత కక్షగా కాకుండా.. దానిని దళిత వర్గాల ఆత్మగౌరవ పోరాటంగా మార్చడం ద్వారా వైఎస్ఆర్‌సీపీలో ఒక కీలకమైన దళిత ఫేస్ గా ప్రొజెక్ట్ అవ్వాలనేది ఆయన స్కెచ్. సునీల్ కుమార్ వ్యాఖ్యలపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అంతే ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. భీమవరంలో జరిగింది మత సభ లేదా సామాజిక సభ కాదని, అది పక్కా వైసీపీ పార్టీ సభ అని రఘురామ ఎద్దేవా చేశారు. అసలు ఒక ఐపీఎస్ అధికారి 4,000 ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఛార్జ్‌షీట్లు ఎలా వేయిస్తారని, అది కోర్టులు , దర్యాప్తు అధికారుల పరిధిలోని అంశమని గుర్తుచేశారు. హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్న, సర్వీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న సునీల్ కుమార్‌పై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రఘురామకృష్ణరాజు ఇటీవల రామాలయంతో పాటు చర్చి విషయంలోనూ వివాదాస్పదం అయ్యారు. ఆయనకు కౌంటర్ ఇచ్చే గట్టి నాయకుడి కోసం జగన్ చూస్తున్నారు. సరిగ్గా ఈ తరుణంలో కూటమిలో అత్యంత కీలకమైన రఘురామకృష్ణరాజును టార్గెట్ చేయడం ద్వారా జగన్ దృష్టిలో పడాలనేది సునీల్ కుమార్ ప్లాన్. కూటమి ప్రభుత్వంపై ఎంత గట్టిగా పోరాడితే.. వైసీపీలో అంతటి ప్రాధాన్యత దక్కుతుందనే ఆలోచనతోనే, రఘురామతో ఉన్న వివాదాన్ని తన భవిష్యత్తు పొలిటికల్ కెరీర్‌కు పెట్టుబడిగా మార్చుకోవడానికి సునీల్ కుమార్ సిద్ధమయ్యారన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజకీయాల్లో ఒక పెద్ద లీడర్‌ను ఢీకొట్టడం ద్వారా రాత్రికి రాత్రే పాపులారిటీ తెచ్చుకోవాలనే పాత ఫార్ములాను పీవీ సునీల్ కుమార్ వాడుకుంటున్నారు. అయితే, ఖాకీ చొక్కా విప్పకముందే ఇలాంటి బహిరంగ రాజకీయ సవాళ్లు విసరడం ఆయన చుట్టూ మరిన్ని చట్టపరమైన చిక్కులను తెచ్చిపెట్టేలా ఉంది. మరి రఘురామకృష్ణరాజును బూచిగా చూపిస్తూ సునీల్ కుమార్ వేసుకుంటున్న ఈ పొలిటికల్ రూట్‌మ్యాప్ ఆయనను వైఎస్ఆర్‌సీపీలో ఏ స్థాయికి తీసుకెళ్తుందో వేచి చూడాలి.

# పంథా మార్చిన పవన్...

కాకినాడ, జూన్ 5, (న్యూస్ పల్స్) జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మీద పడిన ముద్రను చెరిపేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వరకూ ఆయన మౌనంగానే ఉన్నారు. ప్రభుత్వంలో జరిగిన, తప్పొప్పులను ప్రశ్నించడం లేదు. అయితే ఇప్పుడు పూర్తిగా తన పంథాను మార్చుకున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పటికే రాజకీయాల్లో తాను ఏం చేయాలి? ఎలా ఉండాలి? అన్న దానిపై ఒక క్లారిటీకి వచ్చినట్లుంది. ఏపీ రాజకీయాల్లో కేవలం టీడీపీ, వైసీపీ చుట్టూ రాజకీయాలు తిరగకుండా జనసేన ను కూడా అందులో యాడ్ చేయాలన్న తపన పవన్ కల్యాణ్ లో కనిపిస్తుంది. అందుకే ఆయన ఇటీవల కాలంలో తీసుకుంటున్న నిర్ణయాలు ఒకింత కూటమిలోని మిత్ర పక్షాలను కూడా ఆలోచనలో పడేస్తున్నాయి. ముందుగా గీత దాటిన ఎమ్మెల్యేలపై చర్యలకు సిద్ధమవుతున్నారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విప్ పదవి నుంచి తప్పించారు. అలాగే ప్రకాశం జిల్లా పార్టీ కార్యవర్గాన్ని మొత్తం రద్దు చేశారు. ఇది ఒక రకంగా టీడీపీకి బలమైన సంకేతాలు ఇచ్చినట్లయింది. టీడీపీ ఎమ్మెల్యేలు అనేక మందిపై ఆరోపణలు వచ్చాయి. ఒక ఆదిమూలం మినహా టీడీపీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. అవినీతి ఆరోపణలు వచ్చినా చూసీ చూడనట్లు టీడీపీ వదిలేస్తుందన్న సిగ్నల్స్ ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లిపోయాయి. అందుకే పవన్ కల్యాణ్ తాను అందరి లాంటి వాడిని కానని, రాజకీయాల్లో మార్పుకోసమే వచ్చానని చెప్పడానికి ఈ ప్రయత్నం పవన్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇక ఇప్పటి వరకూ ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగంపై పెద్దగా సీరియస్ అయిన దాఖలాలు కూడా లేవు. కానీ ఇప్పుడు మాత్రం అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు. గోదావరి కాలుష్యం పై మంత్రిపైన, అధికారులపైన కూడా హాట్ కామెంట్స్ చేశారు. పంపారు. దీంతో పవన్ కల్యాణ్ వైసీపీ, టీడీపీకి ప్రత్యామ్నాయం తానేనంటూ ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ తనకంటూ ఒక వ్యూహం ఉందని చెబుతూ పార్టీని కూడా పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తూ, క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నిర్ణయించడం కూడా పొలిటికల్ గేమ్ లో భాగమేనని అంటున్నారు.

# బెజవాడలో డబుల్ డెక్ ఫ్లైఓవర్...

విజయవాడ, జూన్ 5, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజధాని పరిధిలో ఉన్న విజయవాడలోని నిడమానూరు దగ్గర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో మెట్రో ప్రతిపాదన కారణంగా ఈ ప్లాన్‌ను రద్దు చేశారు. తాజాగా విజయవాడ నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం దిశగా మరోసారి అడుగులుపడుతున్నాయి. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబును విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కలిసి డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ గురించి విన్నవించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ సమస్యను వివరించారు.. గడ్కరీ కూడా సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ కృష్ణబాబు మోర్త్‌కు లేఖ రాశారు.. దీంతో మరోసారి ఫ్లై ఓవర్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ కృష్ణబాబు నిడమానూర్ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ గురించి మోర్త్‌కు లేఖ రాశారు. విజయవాడలోని మహానాడు కూడలి నుంచి నిడమానూరు మధ్య ట్రాఫిక్ సమస్యలు పెరిగాయని వివరించారు. అలాగే ప్రమాదాల నివారించడానికి, విజయవాడ నుంచి విమానాశ్రయానికి ఇదే ప్రధాన మార్గమని గుర్తు చేశారు. అందుకే ఇక్కడ ఫ్లై ఓవర్ అవసరం చాలా ఉందని.. అందుకే ఇప్పటికే తయారుచేసిన డీపీఆర్‌ను అవసరమైన మార్పులు చేసి నిర్మాణాన్ని ప్రారంభించేలా చూడాలని కోరారు. త్వరలోనే దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. విజయవాడ బైపాస్ అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే.. అయినా నరే నగరంలోకి వచ్చే భారీ వాహనాల రద్దీ తగ్గలేదు. బైపాస్‌లో ఉన్న టోల్‌గేట్ల ఫీజులు కట్టకుండా తప్పించుకునేందుకు చాలామంది నగరానికి వచ్చేవారితో ఈ రూట్ ప్రమాదాల కేంద్రంగా మారిందంటున్నారు. ఎనికేపాడు, రామవరప్పాడు కూడళ్లలో ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అదే ఫ్లై ఓవర్ వస్తే నగరంలో ప్రమాదాలు జరిగే మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు 7 కిలోమీటర్ల మేర వాహనాల రద్దీ, ప్రమాదాలు తగ్గుతాయని చెబుతున్నారు అధికారులు. అందుకే ఫ్లై ఓవర్ అవసరం ఉందని చెబుతున్నారు. గతంలో ఏపీ మెట్రో కార్పొరేషన్ ఈ నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలంటే రూ. వెయ్యి కోట్లు అవసరమని డీపీఆర్ సిద్ధం చేసింది. మొత్తం ఏడు కిలోమీటర్ల సెంట్రల్ మీడియం ఫ్లై ఓవర్‌లో 4.5 కిలో మీటర్ల డబుల్ డెక్కర్ పైవంతెన నిడమానూరునుంచి రామవరప్పాడు వరకు వస్తుంది. గతంలో మోర్త్.. విజయవాడ బైపాస్ అందుబాటులోకి వస్తే ఈ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ అవసరం ఉండదని భావించి రద్దు చేసింది.

# 2029 లక్ష్యంగా స్థానిక నేతలు

గుంటూరు, జూన్ 5, (న్యూస్ పల్స్)రానున్న ఎన్నికల్లో తిరిగి కూటమి అధికారంలోకి తెచ్చేందుకు చంద్రబాబు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అందుకోసం అభ్యర్థుల ఎంపికలో రాజీ పడకూడదని నిర్ణయించుకున్నారు. 2029 ఎన్నికల్లో గెలిచి తీరాలంటే అంతకంటే ముందుగా వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు వైసీపీని లేకుండా చేయాలని, తద్వారా మానసికంగా దెబ్బతీయాలని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకోసమే చంద్రబాబు నెలలో పదిహేను రోజుల పాటు వివిధ కార్యక్రమాల పేరుతో జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. ఏదో ఒక కార్యక్రమాన్ని పెట్టుకుని ఆ జిల్లాలకు వెళ్లి కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. క్యాడర్ లో ఉత్తేజం తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. క్యాడర్ మరింత బలంగా పనిచేసేందుకు కార్యకర్తల సమావేశంలోనే ఎమ్మెల్యేల పనితీరును ప్రశ్నించడం కూడా చంద్రబాబు గెలుపు వ్యూహంలో భాగమేనని అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేపై క్యాడర్ అసంతృప్తిగా ఉందని గుర్తించిన చంద్రబాబు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలంటే ఎమ్మెల్యేలకంటే క్యాడర్ ముఖ్యం. ఆ విషయాన్ని గుర్తించిన చంద్రబాబు వేదికపైనే ఎమ్మెల్యేల తప్పులను ఎత్తి చూపుతున్నారు. క్యాడర్ కు తాను ఉన్నానని భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మరొకవైపు లోకేశ్ కూడా జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఖచ్చితంగా కార్యకర్తలతో సమావేశాలు పెడుతుండటం వారిలో ఉత్తేజం తేవడం కోసమే. ప్రస్తుతం ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని చంద్రబాబుకు తెలియనిది కాదు. ప్రజలతో పాటు కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తితో ఉన్నారు. మద్యం, ఇసుక వంటి వాటిల్లో ఎమ్మెల్యేలు కూరుకుని ఉండటంతో వారిని ఇప్పటికే చంద్రబాబు పిలిచి వార్నింగ్ ఇచ్చారు. ఫస్ట్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా కొందరి ఎమ్మెల్యేల పనితీరు మారకపోవడం, కార్యకర్తల్లో ఉన్న నిరాశ, నిస్పృహలను పారదోలి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం చేసేందుకు చంద్రబాబు ఈ పథాన్ని ఎంచుకున్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో గెలవడంతో పాటు రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకూ క్యాడర్ ను కాపాడుకునేందుకు చంద్రబాబు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంత వరకూ ఫలిస్తుందో చూడాలి.

# నెల రోజులు టీ మానేస్తే, ఊహించని విధంగా..!!

టీ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమైంది. చాలా మంది ప్రతిరోజూ ఉదయం మంచం మీద నుండి లేచిన వెంటనే టీ తాగి నిద్రలేవడం ఇష్టపడతారు. అదే సమయంలో, చాలా మంది అల్పాహారం సమయంలో కూడా టీ తాగుతారు. కొంత మంది టీకి ఎంతగా బానిసలయ్యారంటే, రోజుకు 3 నుండి 4 సార్లు టీ తాగుతారు. అయితే, ఇంతగా అలవాటు పడిన వారు 30 రోజులు టీ మానేస్తే శరీరం అద్భుతమైన రీబూట్ ప్రక్రియకు లోనవుతుంది.



ఊహించని మార్పు కనిపిస్తుంది. ఈ 30 రోజుల ఛాలెంజ్ పైన నిపుణులు ఆసక్తి కర అంశాలను వెల్లడిస్తున్నారు. టీ ప్రియులకు, ఒక నెల పాటు టీ తాగకుండా ఉండటం పెద్ద సవాలుగా ఉంటుంది. కానీ, టీ తాగాలనే కోరికను అరికట్టడం వల్ల వారి ఆరోగ్యానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు లభిస్తాయి. ఈ మార్పు బాహ్య సౌందర్యానికే కాకుండా శరీరంలోని ప్రతి కణాన్నీ పునరుజ్జీవింపజేస్తుంది. కళ్ల కింద నలుపు మాయమై, ముఖం యవ్వనంగా మారుతుంది. లోలోపల అవయవాలు కూడా మరింత చురుగ్గా పనిచేస్తాయి. రక్తప్రసరణ మెరుగుపడి, మంచి నిద్రపట్టడంతోపాటు తెలియకుండానే మనలో ఒక కొత్త ఉత్సాహం ఉరకలేస్తుంది. టీలో ఉండే కెఫీన్ మన శరీరం నుంచి నీటిని త్వరగా బయటికి పంపించేస్తుంది. దీంతో చర్మం పొడిబారినట్లు కనిపిస్తుంది. కాబట్టి టీ మానేయడం వల్ల శరీరంలో నీటి శాతం స్థిరంగా ఉండి, చర్మకణాలకు తగిన తేమ అందుతుంది. తద్వారా ముఖం, బుగ్గలు తాజాగా మెరుస్తూ ఉంటాయి. ఇక టీ మానేసి నీళ్లు, హెర్బల్ డ్రింక్స్ తాగడం వల్ల లివర్, కిడ్నీలు చురుగ్గా పనిచేసి, రక్తాన్ని సమర్థంగా శుద్ధి చేస్తాయి. టీలో సాధారణంగా కలిపే పాలు, చకెర మొటిమలకు మంచి మిత్రులు. చకెర తీసుకోవడం వల్ల ఇన్సులిన్ ఒకసారిగా పెరుగుతుంది. ఇది చర్మంలోని నూనె గ్రంథులను ప్రేరేపించి ముఖంపై ఎకువ నూనె ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయి. ఇక పాలలోని హార్మోన్లు మొటిమలను ప్రేరేపిస్తాయి. టీ మానేయడం వల్ల నూనె ఉత్పత్తి తగ్గి కొత్త మొటిమలు రావడం నెమ్మదిస్తుంది. కళ్ల కింద నలుపు రావడానికి ప్రధాన కారణం నిద్రలేమి. టీలో ఉండే కెఫీన్ నిద్రను కలిగించే మెదడులోని అడెనోసిన్‌ను అడ్డుకుంటుంది. టీ మానేయడం వల్ల శరీరం సహజమైన నిద్ర సైకిల్‌కు చేరుకుంటుంది. గాఢ నిద్ర పట్టడం వల్ల కళ్ల చుట్టూ ఉండే రక్తనాళాలు విశ్రాంతి పొందుతాయి. ఫలితంగా కళ్ల కింద డార్క్‌నెస్, కళ్ల కింద వాపు కూడా తగ్గుతుంది. అయితే ఒక్కసారిగా టీ మానేస్తే మొదటి వారం రోజులు కొంచెం ఇబ్బందిగా ఉండొచ్చు. తేలికపాటి తలనొప్పి, నీరసం, చిరాకు ఉండొచ్చు. అలాంటప్పుడు నెల రోజుల పాటు టీకి బదులుగా గోరువెచ్చని నీళ్లు, నిమ్మరసం, కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటికిపోయి సత్ఫలితాలు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# సూపర్ టేస్టీ కరివేపాకు పొడి.. ఇలా ఈజీగా చేసుకోండి..!



మనం సాధారణంగా కూరలు, పప్పు, చారు ఇలా ఏ వంట వండినా అందులో తప్పకుండా రెండు రెమ్మల కరివేపాకు వేస్తుంటాం. ఇలా వంటల్లో కరివేపాకు వేసుకోవడం వల్ల కమ్మదనం పెరుగుతుంది. అలాగే కరివేపాకులను రోజూ తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనం అని నిపుణులు చెబుతున్నారు. కరివేపాకులను తినడం వల్ల గుడ్ బ్యాక్టీరియా పెరుగుతుందని అజీర్ణం, కడుపుబ్బరం, గ్యాస్ లాంటి సమస్యలు తగ్గుతాయని సూచిస్తున్నారు. అలాగే కరివేపాకు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. మరి కరివేపాకుతో చాలామంది చట్నీ చేసుకుంటారు. ఇంకొంతమంది కరివేపాకు పొడి కూడా చేసుకుంటారు. మరి ఇంట్లోనే ఈజీగా కరివేపాకు పొడి ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం..కరివేపాకు పొడి తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. కరివేపాకు ఒక పెద్ద కప్పు(శుభ్రంగా కడిగి పెట్టినవి), వెల్లుల్లి రెబ్బలు 6 నుంచి 8 పొట్టు తీసినవి, ఎండుమిర్చి 10 నుంచి 12 కారానికి తగినంత, ధనియాలు ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర అర టేబుల్ స్పూన్, పల్లీలు ఒక టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, ఇంగువ చిటికెడు తీసుకోవాలి. ఇక తయారీ విధానం చూస్తే.. ముందుగా కరివేపాకు ఆకులను శుభ్రంగా కడిగి, తేమ లేకుండా పూర్తిగా ఆరబెట్టుకోవాలి. ఇప్పుడు పొయ్యి మీద పెనం పెట్టుకోవాలి. అందులో జీలకర్ర, ఎండుమిర్చి, పల్లీలు, వెల్లుల్లి రెబ్బలను వేసి దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు అదే పెనంలో కరివేపాకు ఆకులను వేసి అవి క్రిస్పీగా అయ్యేంత వరకూ వేయించుకోవాలి. చివరగా ఇంగువ వేసి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు వేయించిన పదార్థాలను పూర్తిగా చల్లారాక వాటిని మిక్సీ జార్ లో వేసి తగినంత ఉప్పు చేర్చి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు తయారైన కరివేపాకు పొడిని గాలి చొరబడని డబ్బాలో భద్ర పరచుకోవాలి. ఈ కరివేపాకు పొడిని వేడి వేడి అన్నంతో కలిపి తింటే సూపర్ టేస్టీగా ఉంటుంది.

# నెల్లూరు స్టైల్ 'నెత్తళ్ల పులుసు'.. ఇలా చేస్తే గిన్నె మొత్తం ఊడ్చేస్తారు..!

చేపల కూర అనగానే చాలామందికి నోరూరుతుంది. ముఖ్యంగా తీర ప్రాంతాల ప్రజలు చేపలను ఎక్కువగా తింటారు. చేపలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా చేస్తుంటారు. ఆంధ్రా స్పెషల్, నెల్లూరు స్పెషల్, తెలంగాణ స్పెషల్ ఇలా ప్రాంతాన్ని బట్టి రుచి మారిపోతూ ఉంటుంది. అయితే నెల్లూరు స్టైల్ చేపల పులుసుకు ఉన్న క్రేజే వేరు.. ఈ చేపల పులుసు చాలా టేస్టీగా ఉంటుంది. మరి నెల్లూరు స్టైల్ లో నెత్తళ్ల పులుసు ఎప్పుడైనా ట్రై చేశారా..? నెత్తళ్ల పులుసు ఇలా చేస్తే గిన్నె మొత్తం ఊడ్చేస్తారు. నెత్తళ్ల పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు.. తయారీ విధానం గురించి పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. నెత్తళ్ల చేపల పులుసు తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే ముందుగా నెత్తళ్లు చిన్నవి 500 గ్రాములు, చింతపండు పెద్ద



నిమ్మకాయ సైజంత, మామిడికాయ ముక్కలు ఒక కప్పు, ఉల్లిపాయలు రెండు ముక్కలుగా కట్ చేసుకోవాలి, టమాటోలు రెండు ముక్కలుగా కట్ చేసుకోవాలి, పచ్చిమిర్చి నాలుగు, మసాలా దినుసులు(పోపు కోసం) ఆవాలు, జీలకర్ర, మెంతులు, కరివేపాకు(కొద్దిగా) తీసుకోవాలి, అలాగే పసుపు పావు టీ స్పూన్, కారం రెండు టీ స్పూన్ లు లేదా రుచికి తగినంత, ఉప్పు రుచికి తగినంత, కొత్తిమీర గార్నిష్ కోసం తీసుకోవాలి. ఇప్పుడు నెత్తళ్ల పులుసు తయారీ విధానం చూస్తే ముందుగా ఒక గిన్నెలో నూనె వేడి చేసి పోపు దినుసులు వేసి చిటపటలాడించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. ఇప్పుడు టమాటో ముక్కలు, పసుపు, కారం, చింతపండు రసం, ఉప్పు, మామిడికాయ ముక్కలు వేసి ఉడికించుకోవాలి. పులుసు మరిగిన తర్వాత నెత్తళ్లు చేపలు వేసి తక్కువ మంటపై ఉడికించుకుని దింపేస్తే సరి.. చివరగా కొత్తిమీర గార్నిష్ చేసుకుంటే చాలు.. సూపర్ టేస్టీ నెత్తళ్ల పులుసు రెడీ అయినట్టే..

# స్ట్రాబెర్రీ.. పోషకాల ఖజానా





ఎంతో ఇష్టంగా తినే పండ్లలో ఒకటి.. స్ట్రాబెర్రీ. చూడగానే నోరూరించే ఈ పండ్లు రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాలలోనూ ముందుంటాయి. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి ఇందులో. ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి ఇవన్నీ. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది, జీర్ణక్రియను చురుగ్గా పనిచేస్తుంది.

చర్మానికి సహజమైన కాంతి అందుతుంది. పిల్లలు, పెద్దలు ఆస్వాదించడానికి ప్రకృతి సిద్ధమైన స్నాక్‌గా కూడా వీటిని తీసుకోవచ్చు. పచ్చిగా తిన్నా, స్మూతీలలో వాడినా, అల్పాహారంలో భాగంగా చేసుకున్నా, సాయంత్రం వేళ స్నాక్స్ గా తీసుకున్నా స్ట్రాబెర్రీలు.. శరీరానికి అవసరమైన పోషణ, కావాల్సిన ఎనర్జీని అందిస్తాయి.

**స్ట్రాబెర్రీల్లో..**

స్ట్రాబెర్రీలు తక్కువ కేలరీలను కలిగి ఉన్నప్పటికీ, కీలక పోషకాలతో సమృద్ధిగా నిండి ఉంటాయి. విటమిన్ సీ అధిక స్థాయిలో ఉంటుంది. దీనివల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. చర్మం నిగారింపును సంతరించుకు ంటుంది. అలాగే ఇవి జీర్ణక్రియకూ సహాయపడతాయి, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఎందుకంటే అవి డైటరీ ఫైబర్‌కు మంచి వనరు.అ ంతేకాదు, యాంథోసైనిన్లు, ఫ్లేవనా యిడ్లు, ఫెనోలిక్ యాసిడ్ల వంటి వివిధ ఫైటోకెమికల్స్ యాంటీఆ క్సిడెంట్లుగా, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్లుగా పని చేస్తాయి. చాలా తీపి పండ్లతో పోలిస్తే, స్ట్రాబెర్రీల్లో లోయర్ మిడిల్ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతుంది. స్ట్రాబెర్రీలను క్రమం తప్పకుండా తీసుకోవడం గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుందని కొన్ని పరిశోధనలు సైతం సూచిస్తున్నాయి.ఈ పండ్లలోని ఫ్లేవనాయిడ్లు, యాంథోసైనిన్లు రక్తపోటును తగ్గించడం, చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం, మొత్తం రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో సంపూర్ణంగా సహాయపడతాయి.

**యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ప్రభావాలు**

స్ట్రాబెర్రీలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించగలుగుతాయి. ఫ్రీ రాడికల్స్.. కణాల వృద్ధాప్యం, కడుపులో మంట (ఇన్ఫ్లమేషన్)కు దోహదపడే అస్థిర అణువులు. స్ట్రాబెర్రీలు తీసుకోవడం వల్ల అందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఫైబర్, ఫైటోకెమికల్స్ సమృద్ధిగా ఉండటం వల్ల, స్ట్రాబెర్రీలు పేగు మైక్రోబయోమ్‌కు మద్దతు ఇస్తాయి. క్రమంగా జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. ఇవి ప్రయోజనకరమైన పేగు బాక్టీరియాకు ఆహారాన్ని అందించి జీర్ణ సౌలభ్యాన్ని పెంపొందిస్తాయి.

**చర్మ ఆరోగ్యం..**

విటమిన్ సీ కొల్లాజెన్ ఉత్పత్తిలో స్ట్రాబెర్రీ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు.. అల్ట్రా వయొలెట్ కిరణాలు, వాయు కాలుష్యం వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షించడంలో సహాయపడతాయి కూడా. స్ట్రాబెర్రీల్లోని ఫ్లేవనాయిడ్లు వయస్సు సంబంధిత జ్ఞాపక శక్తి క్షీణతను తగ్గించడం ద్వారా మెదడు ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, దీర్ఘకాలిక నాడీ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయడానికీ సహకరిస్తాయి.

# చైనీస్ స్టైల్ "పనసకాయ మంచూరియా" ట్రై చేస్తారా..?

చైనీస్ స్టైల్ వంటకాలంటే ఇష్టపడేవారికి పనసకాయ మంచూరియా ఒక అద్భుతమైన ఎంపిక. పచ్చి పనసకాయతో తయారయ్యే ఈ వంటకం బయటకు క్రిస్పీగా, లోపల మెత్తగా ఉండి ప్రత్యేక రుచిని అందిస్తుంది. వెజిటేరియన్లకు ఇది చికెన్ మంచూరియాకు మంచి ప్రత్యామ్నాయంగా చెప్పొచ్చు. సాయంత్రం స్నాక్‌గా, పార్టీ స్టార్టర్‌గా లేదా ఫ్రైడ్ రైస్, నూడుల్స్‌తో సైడ్ డిష్‌గా సర్వ్ చేస్తే అద్భుతంగా ఉంటుంది.పచ్చి పనసకాయలో ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇందులో విటమిన్ అ, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. శరీరానికి శక్తిని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. ఒక్కసారి ఈ పనసకాయ మంచూరియాను ట్రై చేస్తే.. రెస్టారెంట్ స్టైల్ రుచిని ఇంట్లోనే ఆస్వాదించిన ఆనందం మీ సొంతమవుతుంది. ఈ టేస్టీ రెసిపీ మీకోసం ప్రత్యేకంగా..

**కావలసిన పదార్థాలు..**

పచ్చి పనసకాయ ముక్కలు – 2 కప్పులుకార్న్‌ఫ్లోర్ – 2 టేబుల్ స్పూన్లు మైదా – 2 టేబుల్ స్పూన్లుఅల్లం-వెల్లుల్లి పేస్ట్ – 1 టీస్పూన్‌కారం – 1 టీస్పూన్‌మిరియాల పొడి – ½ టీస్పూన్‌ఉప్పు – రుచికి సరిపడానూనె – డీప్ ఫ్రైకి సరిపడానూనె – 2 టేబుల్ స్పూన్లువెల్లుల్లి – 1 టేబుల్ స్పూన్ (సన్నగా తరిగినది)అల్లం – 1 టీస్పూన్ (సన్నగా తరిగినది)పచ్చిమిర్చి – 2ఉల్లిపాయ – 1 (చదరపు ముక్కలు)క్యాప్సికం – ½ కప్పుసోయా సాస్ – 1½ టీస్పూన్లురెడ్ చిల్లీ సాస్ – 1 టీస్పూన్‌టమాటో కెచప్ – 1 టేబుల్ స్పూన్‌వెనిగర్ – ½ టీస్పూన్ (ఐచ్ఛికం)కార్న్‌ఫ్లోర్ – 1 టీస్పూన్‌నీరు – ½ కప్పుమిరియాల పొడి – ½ టీస్పూన్‌ఉప్పు – తగినంతఉల్లికాడలు – 2 టేబుల్ స్పూన్లునువ్వులు – కొద్దిగా (ఐచ్ఛికం)తయారీ విధానం..ముందుగా పచ్చి పనసకాయ ముక్కలను శుభ్రంగా కడిగి, కొద్దిగా ఉప్పు, పసుపు వేసిన నీటిలో మెత్తగా ఉడికించుకోవాలి. ఉడికిన తర్వాత నీటిని పూర్తిగా వంపేసి, ముక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవాలి.

# పల్లీ రైస్ ఇలా తయారుచేస్తే మెతుకు కూడా మిగల్చరు!

వేగంగా, రుచికరంగా లంచ్ బాక్స్ లోకి టేస్టీ, స్పైసీ మంచి పౌష్టికాహారం తినాలనుకుంటే పల్లీల అన్నం చాలా మంచి రెసిపీ. పల్లీల రైస్ ను మిగిలిన అన్నంతో సులభంగా తయారుచేయవచ్చు. ఇది చల్లారిన తర్వాత కూడా రుచిగా ఉంటుంది. చూడటానికి బాగుంటుంది, దీనికి వేరే సైడ్ డిష్ కూడా అవసరం లేదు. ఇకపల్లీల అన్నం ఎలా తయారు చేస్తారో ఒకసారి చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు:**

వేరుసెనగపప్పు: 1/4 కప్పు నువ్వులు: 1/4 కప్పు ఎండు మిర్చి: 4 పచ్చి కొబ్బరి (తురిమినది): 1/4 కప్పుఉడికించిన అన్నం: 1 కప్పు ఉప్పు: తగినంత నూనె: 1/4 కప్పు ఆవాలు: 1/2 టీస్పూన్‌మినపప్పు: 1 టీస్పూన్‌శెనగపప్పు: 1 టీస్పూన్‌కరివేపాకు: 2 రెమ్మలు

**తయారీ విధానం**

ముందుగా స్టవ్ వెలిగించి ఒక పాన్ పెట్టి, పాన్ లో పావు కప్పు వేరు శనగపప్పు, పావు కప్పు నువ్వులు, నాలుగు ఎండు మిర్చి వేసి సిమ్ లో పెట్టి దోరగా వేయించుకోవాలి. తరువాత అదే పాన్ లో తురుముకున్న పచ్చి కొబ్బరి కూడా వేసి వేయించుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని కాస్త పలుకుగా గ్రైండ్ చేసుకోవాలి.ఇలా చేస్తే పల్లీల రైస్ సూపర్ఆపై అదే పాన్ లో నూనె వేసుకుని తాలింపు గింజలు వేసి పోపు చేసుకోవాలి. ఈ పోపులో కరివేపాకు కూడా వేసుకోవాలి ఆపై అందులో అన్నం వేసి, మిక్సీ చేసి పెట్టుకున్న పొడిని, రుచికి సరిపడా ఉప్పును వేసి బాగా కలుపుకోవాలి. ఆపై స్టవ్ ఆఫ్



చేసి సర్వ్ చేసుకోవటమే. ఇది లంచ్ బాక్సులోకి చాలా బాగుంటుందిటేస్టీ, హెల్దీ పుదీనా రైస్.. ఇలా చేస్తే మొత్తం ఖాళీ చేస్తారు!టేస్టీ, హెల్దీ పుదీనా రైస్.. ఇలా చేస్తే మొత్తం ఖాళీ చేస్తారు!ఈ టిప్స్ పాటిస్తే టేస్టీ పల్లీల రైస్పల్లీల అన్నం అద్భుతమైన రుచిని పొందాలంటే కొన్ని చిట్కాలు ముఖ్యం. తాలింపులోని పప్పు దినుసులు, వేరుసెనగపప్పును సన్నని సెగపై నెమ్మదిగా, ఎర్రగా, కరకరలాడే వరకు వేయించాలి. ఇలా లోపలి వరకు వేగితేనే అన్నానికి మంచి రుచి వస్తుంది. ముఖ్యంగా, ఎండాకాలంలో పచ్చి కొబ్బరిని నేరుగా అన్నంలో కలిపితే త్వరగా పాడవుతుంది. రుచి తగ్గకుండా, అన్నం చెడిపోకుండా ఉండాలంటే, పచ్చి కొబ్బరిని తాలింపులో వేసి వేయించడం ఉత్తమం.


# స్పోర్ట్స్ న్యూస్

## ఒకే ఓవర్లో మూడు వికెట్లు.. రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ నిలబడగలడా?



లార్డ్స్ వేదికగా న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు టెస్టు మ్యాచ్ ఆడుతున్నాయి. ఇంగ్లండ్ స్టార్ బౌలర్ ఓలీ రాబిన్సన్ అదిరే రీఎంట్రీ ఇచ్చాడు. అద్భుత ప్రదర్శనతో విధ్వంసం సృష్టిస్తున్నాడు. గురువారం ప్రారంభమైన టెస్టు మ్యాచ్ తొలి రోజునే రాబిన్సన్ వేసిన తొలి ఓవర్ క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకే ఓవర్లో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మూడు వికెట్లు తీశాడు. ఈ నేపథ్యంలో భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు తెరపైకి వచ్చింది. రాబిన్సన్ బౌలింగ్‌లో వైభవ్ నిలబడగలడా? అంటూ సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. వర్షం కారణంగా న్యూజిలాండ్–ఇంగ్లండ్ మ్యాచ్ కాసేపు ఆగింది. స్వింగ్‌కు అనుకూలించే లార్డ్స్ పిచ్‌ను పూర్తిగా వినియోగించుకున్న రాబిన్సన్.. వేసిన తొలి ఓవర్‌లోనే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్లను కుదేలు చేశాడు. తొలి రెండు బంతులు డాట్స్, మూడో బంతికి డేవాన్ కాన్వే ఔట్, నాలుగో బంతి డాట్, ఐదో బంతికి కేన్ విలియమ్సన్ ఔట్, ఆరో బంతికి రచిన్ రవీంద్రను పెవిలియన్‌కు పంపి.. న్యూజిలాండ్‌కు గట్టి షాకిచ్చాడు. మూడు వికెట్లు, మెయిడెన్ ఓవర్‌తో ఇంగ్లండ్‌కు శుభారంభాన్ని అందించాడు.రాబిన్సన్ రీఎంట్రీలో వేసిన తొలి ఓవర్‌లోనే విధ్వంసం సృష్టించడంతో దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలోనే ఆసక్తికర ప్రశ్న తెరపైకి వచ్చింది. ఇలాంటి అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌ను 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఎదుర్కొని ఉండేవాడా? అంటూ చర్చ మొదలైంది. 'వైభవ్ ఇలాంటి పరిస్థితుల్లో నిలబడటం కష్టమే' అని కొందరు అభిమానులు అభిప్రాయపడగా.. మరికొందరు 'అతడు ఇంకా భారత జట్టుకు ఆడలేదు. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో ఎలా ఆడతాడో అంచనా వేయడం సరికాదు' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'ఐపీఎల్‌లో ప్రపంచ మేటి బౌలర్లను ఎదుర్కొన్న వైభవ్‌కు ఇదేమీ పెద్ద విషయం కాదు' అంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.

## టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి పంత్ తొలగింపు.. గంభీర్ రియాక్షన్ ఇదే!




టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్‌ను టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. అతడి స్థానంలో కేఎల్ రాహుల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఇరుజట్ల మధ్య శనివారం నుంచి ఏకైక టెస్టు ముల్లాన్‌పూర్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. పంత్‌ను తొలగించడంపై తొలిసారిగా స్పందించాడు. ఈ నేపథ్యంలో పలు కీలక విషయాల గురించి వెల్లడించాడు.'పంత్ తన ఆటతీరును పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం లేదు. తన దూకుడును అలాగే కొనసాగించాలి. కానీ అంతర్జాతీయ ప్లేయర్లు పరిస్థితులకు తగ్గట్టుగా ఆడాల్సిన అవసరం ఉంటుంది. పంత్‌కు మా పూర్తి మద్దతు ఉంటుంది. సందర్భానుసారంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది కాబట్టే వైస్ కెప్టెన్సీపై ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది' అని గంభీర్ వెల్లడించాడు.రిషబ్ పంత్ ప్రస్తుతం ఫామ్‌లేమితో ఇబ్బందులు పడుతున్నాడు. ఐపీఎల్ 2026లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు సారథ్యం వహించిన పంత్.. పేలవ ప్రదర్శన కనబర్చాడు. జట్టును పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిపాడు. దీనికి బాధ్యత వహిస్తూ పంత్.. ఎల్ఎస్‌జీ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌తో టెస్టులో కుల్‌దీప్ యాదవ్ ప్రధాన స్పిన్నర్. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌కు రెస్ట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆగస్టు మధ్యలో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్.. శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో స్పిన్నర్ల గురించి కూడా గంభీర్ స్పందించాడు. 'మానవ్ సుతార్, హర్ష్ దూబె రూపంలో ఇద్దరు యువ స్పిన్నర్లు ఉన్నారు. అఫ్గాన్‌తో మ్యాచ్ వారికి మంచి అవకాశం. అలాగే మాక్కూడా శ్రీలంకతో టెస్టుల కోసం నాలుగో స్పిన్నర్‌ను పరీక్షించుకొనేందుకు వీలు కలుగుతుంది. అదేవిధంగా న్యూజిలాండ్ పర్యటన కోసం కాస్త భిన్నంగా సన్నద్ధం కావాల్సి ఉంది. టెస్టులు ఆడే కొందరిని అఫ్గాన్‌తో వన్డే సిరీస్ నుంచి తప్పిస్తాం. టెస్టుల కోసం మరింత సన్నద్ధత అవసరం అనేదే మా భావన' అని గౌతీ వెల్లడించాడు.

## సూర్యను సారథ్యం నుంచి తప్పించడం సరికాదు: మాజీ క్రికెటర్

టీమిండియా టీ20 కెప్టెన్సీలో మార్పులు రానున్నట్లు తెలుస్తోంది. సూర్యకుమార్ యాదవ్ ను తప్పించి.. శ్రేయస్ అయ్యర్ ను కొత్త కెప్టెన్ గా ఎంపిక చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తన కెప్టెన్సీలో టీమిండియాకు 2026 ప్రపంచ కప్ అందించినప్పటికీ.. వ్యక్తిగత ప్రదర్శన విషయంలో ఘోరంగా విఫలమయ్యాడని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. రాబోయే టీ20 ప్రపంచ కప్ నాటికి కొత్తవారిని సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకునేందుకు తెలుస్తోంది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు.'ఇంగ్లండ్ పర్యటనకు ఫస్ట్ టీమ్‌ను పంపిస్తారా? ద్వితీయ శ్రేణిని పంపిస్తారా?. ఒకవేళ మీరు అత్యుత్తమ జట్టునే పంపించాలనుకుంటే మాత్రం సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించడం సరికాదు. అతడు భారత్ కు ప్రపంచ కప్ అందించిన కెప్టెన్. సూర్య అద్భుతమైన ఆటగాడు. బ్యాటర్‌గా గత ఏడాదిన్నర కాలంలో చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడు. కొత్త కుర్రాళ్లు తమ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. అలాగని ఇలాంటి సమయంలో సూర్యను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించడం సరికాదనేదని నా అభిప్రాయం. ఈ రెండు సిరీసుల్లో అవకాశం ఇవ్వండి. అప్పుడు కూడా అతడి ఆటతీరు బాగోలేకపోతే.. వేరే వారికి జట్టు పగ్గాలను అప్పగించవచ్చు' అని ఎమ్మెస్కే అన్నారు.'ఇప్పుడు భారత జట్టులో ప్రతిభకు కొదవలేదు. కెప్టెన్ రేసులోనూ చాలామంది ఉన్నారు. సంజు శాంసన్, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్.. శ్రేయస్ అయ్యర్ ఈపోటీలో ఉన్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఆడిన ప్లేయర్లకు కాస్త విరామం ఇస్తే బాగుంటుంది. దీంతో కొత్త వారికి అవకాశాలు ఇచ్చేందుకు వీలు కలుగుతుంది. అప్పుడు శ్రేయస్ లేదా ఇతర ఆటగాళ్లకు కెప్టెన్సీ అప్పగించే అవకాశం ఉంది. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్, సంజు, రజత్ పాటిదార్ వంటి ప్లేయర్లను ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపిక చేస్తే బాగుంటుంది' అని ఎమ్మెస్కే ప్రసాద్ వెల్లడించారు.





## టీ20 కెప్టెన్సీ మార్పు నాకేమీ ఆశ్చర్యంగా అనిపించడం లేదు: కైఫ్




భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు త్వరలోనే పెద్ద షాక్ తగలనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. సూర్య టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ప్రచారం జరుగుతోంది. అతడి స్థానంలో స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం. ఈ పరిణామాలపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ స్పందించాడు. సూర్య కెప్టెన్సీ కోల్పోతున్నాడనే వార్తలు తనను ఆశ్చర్యపరచలేదని పేర్కొన్నాడు.'నాకు ఈ వార్తలు ఆశ్చర్యంగా అనిపించడం లేదు. నిజానికి రోహిత్ శర్మ కెప్టెన్సీ కోల్పోయినప్పుడే నేను ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత ఇలాంటి నిర్ణయాలు సహజంగానే కనిపిస్తున్నాయి. సూర్యకుమార్ యాదవ్ విషయంలో ఇది పెద్ద నిర్ణయమే. కానీ రోహిత్ విషయంలో తీసుకున్న నిర్ణయం ఇంకా పెద్దది. ఇప్పుడు కూడా అదే విధానాన్ని కొనసాగిస్తున్నామనే సందేశాన్ని బీసీసీఐ ఇవ్వాలనుకుంటోందని నాకు అనిపిస్తుంది' అని కైఫ్ వెల్లడించాడు.'సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా టీ20 ప్రపంచ కప్ ట్రోఫీ అందించాడు. అందుకే అతడు జట్టులో కొనసాగేందుకు అర్హుడు. ప్రస్తుతం పరుగులు చేయకపోవచ్చు. కానీ జట్టు విజయవంతంగా ముందుకు సాగుతుంటే ఒక ఆటగాడి ఫామ్‌ను మాత్రమే చూసి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదు. నాయకుడిగా అతడు తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్నాడు. అందుకే అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. కెప్టెన్సీ నుంచి తప్పించినప్పటికీ జట్టులో మాత్రం చోటివ్వాలి' అని కైఫ్ పేర్కొన్నాడు. టీ20 జట్టులో నాయకత్వ మార్పుపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ.. సూర్య భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలు భారత క్రికెట్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కెప్టెన్సీ మార్పు నిజమైతే అది టీమిండియా టీ20 ప్రణాళికల్లో కీలక మలుపుగా మారే అవకాశం ఉంది.

## ఇంగ్లండ్, కివీస్ టెస్టు మ్యాచ్‌లో వైభవ్ ప్రస్తావన.. ఎందుకంటే?



టీమిండియా యువ హిట్టర్, రాజస్థాన్ రాయల్స్ స్టార్ బ్యాటర్ సూర్యవంశీ వైభవ్ పేరు దేశాన్ని దాటి ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు ఐపీఎల్ 2026లో పెను విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. అంతేకాక ఈ సీజన్‌లో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక వైభవ్ ప్రదర్శనపై పలువురు క్రికెట్ దిగ్గజాలు ప్రశంసల వర్షం కురిపించారు. వైభవ్ పేరు భారత్, ఐపీఎల్ మ్యాచుల సందర్భంగానే ప్రస్తావనకు రావడమే కాకుండా.. తాజాగా ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో కూడా వినిపించిందిలార్డ్స్ వేదికగా న్యూజిలాండ్, ఇంగ్లండ్ మధ్య గురువారం(జూన్ 04) తొలి టెస్టు మ్యాచ్ ప్రారంభమైంది. వర్షం కారణంగా ఆటకు కాసేపు విరామం లభించింది. ఇదే సమయంలో కామెంటరీ బాక్స్‌లో మాజీ క్రికెటర్లైన ఇయాన్ వార్డ్, నాసర్ హుస్సేన్, సైమన్ డౌల్‌ల మధ్య వైభవ్ పేరు ప్రస్తావనకు వచ్చింది. టెస్ట్ క్రికెట్‌లో సూర్యవంశీతో బ్యాటింగ్ ప్రారంభించాలని వార్డ్ అనడంతో వైభవ్‌పై గురించి చర్చ ప్రారంభమైంది. అలాంటి రోజు ఎంతో దూరంలో ఉండకపోవచ్చని డౌల్ అన్నారు.డౌల్ మాట్లాడుతూ..'అతడు(వైభవ్) టెస్టు క్రికెట్‌లో కూడా విజయం సాధిస్తాడు. దీనికి సమయం కూడా ఎంతో దూరం లేదు. అతడు ఐపీఎల్ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు. ఈ టోర్నీ ముగిసేసరికి అతడికి ఎన్ని అవార్డులు వచ్చాయో నాకు తెలియదు. కానీ 15 ఏళ్ల కుర్రాడికి ఇదో అద్భుతం. అది చూడటానికి చాలా బాగుంది. టీమిండియాలోకి అతడు(వైభవ్) ఎవరి స్థానంలోకి వస్తారో నాకు తెలియదు. కానీ ఎక్కడో అతడికి తప్పకుండా చోటు కల్పించాలి' అని అన్నాడు. ఐపీఎల్ 2026ను 776 పరుగులతో ముగించిన సూర్యవంశీ, తన ఆట భారతీయులనే కాకుండా ఇతర దేశాల క్రికెటర్లను ఆకట్టుకున్నాడు. ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో కామెంటేటర్లు వైభవ్ ను ప్రశంసించడమే ఇందుకు నిదర్శనం.

## ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్‌కు ఘోర పరాజయం

ఐపీఎల్ 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచిన సంగతి తెలిసిందే. దీంతో ఆర్సీబీకి వరుసగా రెండు ట్రోఫీలు అందించిన కెప్టెన్‌గా రజత్ పాటిదార్ నిలిచాడు. ఐపీఎల్ 2026 టైటిల్ అందుకున్న కొన్ని రోజులకే కెప్టెన్‌గా అతనికి ఘోర పరాజయం ఎదురైంది. మరి.. ఐపీఎల్ 2026 ముగిసిన తర్వాత ప్రస్తుతం రజత్ పాటిదార్ మధ్యప్రదేశ్ ప్రీమియర్ లీగ్‌లో ఆడుతున్నాడు. గ్వాలియర్ చీతాస్ జట్టుకు పాటిదార్ సారథ్యం వహిస్తున్నాడు. అయితే బుధవారం ఇండోర్ వేదికగా ఉజ్జయిన్ ఫాల్కన్స్, గ్వాలియర్ చీతాస్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో చీతాస్ జట్టు 92 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో పాటిదార్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ముందుగా బ్యాటింగ్ చేసిన ఉజ్జయిన్ ఫాల్కన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 221 పరుగులు చేసింది. మాధవ్ తివారీ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు.అనంతరం గ్వాలియర్ చీతాస్ దారుణంగా విఫలమైంది. ఐపీఎల్ 2026లో 501 పరుగులు చేసిన పాటిదార్.. ఈ మ్యాచ్‌లో కేవలం 11 పరుగులే చేసి వెనుదిరిగాడు. ఉజ్జయిన్ ఫాల్కన్స్ బౌలర్లలో ఆయుష్ మంకర్ మూడు వికెట్లతో రజత్ పాటిదార్ టీమ్ పతనాన్ని శాసించాడు. గ్వాలియర్ చీతాస్ 129 పరుగులకే పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. గ్వాలియర్ చీతాస్ తన తదుపరి మ్యాచ్‌ను శుక్రవారం భోపాల్ లెపర్డ్స్‌తో ఆడనుంది. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో టీమిండియా ఆడబోయే అప్‌కమింగ్ టీ20 సిరీస్‌లకు రజత్ పాటిదార్‌ను ఎంపిక అయ్యే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి.



# సినిమా

## ‘భోళా బాలయ్య’.. ఈ బర్త్ డే ఎప్పటికీ మర్చిపోలేమా?

**అయితే ఈసారి బాలయ్య వేడుకల ప్రత్యేకత కేవలం హైదరాబాద్ కే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలయ్య అభిమాన సంఘాలు ఒకేసారి సెలబ్రేషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి.**

టాలీవుడ్ నటసింహం నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు అంటే అభిమానులకు పండుగ. ప్రతి ఏడాది ఆయన బర్త్ డేను ఎంతో గ్రాండ్ గా సెలబ్రేట్ చేస్తుంటారు. ఏడాది అంతా ఆ ఒక్క రోజు కోసం చాలా వెయిట్ చేస్తుంటారు. అయితే మరో రెండు రోజుల్లో బాలయ్య బర్త్ డే ఉండగా.. ఈసారి మాత్రం పుట్టినరోజు వేడుకలు మరో రేంజ్ లో ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది.




రీసెంట్ గా సోషల్ మీడియాలో విడుదలైన ‘భోళా బాలయ్య’ పోస్టర్, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఏర్పాట్లు చూస్తుంటే ఈసారి బర్త్ డే వేడుకలు బాలయ్య అభిమానులకు ఎప్పటికీ గుర్తుండిపోయేలా మారనున్నాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఇప్పుడు ఆ విషయం నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. భోళా బాలయ్య అనే హ్యాష్ ట్యాగ్ కూడా ట్రెండ్ అవుతోంది.

జూన్ 7న జరగనున్న వేడుకలకు సంబంధించిన శ్రేయాస్ మీడియా విడుదల చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. “ది వెయిట్ ఈజ్ ఓవర్.. ది సెలబ్రేషన్ బిగిన్స్” అనే క్యాప్షన్ తో వచ్చిన ఆ పోస్టర్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా ‘భోళా బాలయ్య’ అనే కాన్సెప్ట్ ను ముందుకు తీసుకురావడం విశేషంగా మారింది.

పోస్టర్ లో పరమశివుడి రూపానికి బాలకృష్ణ ఫేస్ ను యాడ్ చేస్తూ రూపొందించిన డిజైన్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. బాలయ్యను దేవుడిలా ఆరాధించే అభిమానులకు ఆ పోస్టర్ మరింత కనెక్ట్ అవుతోంది. అందుకే విడుదలైన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో వైరల్ అయిపోయింది. ఫుల్ గా షేర్ చేస్తూ అభిమానులు సందడి చేస్తున్నారు.

అయితే ఈసారి బాలయ్య వేడుకల ప్రత్యేకత కేవలం హైదరాబాద్ కే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలయ్య అభిమాన సంఘాలు ఒకేసారి సెలబ్రేషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, గల్ఫ్ దేశాలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలకు ప్లానింగ్ జరుగుతోంది. ‘భోళా బాలయ్య’ స్లోగన్ గ్లోబల్ రేంజ్ లో మార్మోగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

ఇక హైదరాబాద్ లో జరిగే వేడుకలకు భారీ సంఖ్యలో అభిమానులు హాజరయ్యే అవకాశం ఉంది. గతంలో కంటే భారీ రేంజ్ లో ఈవెంట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అభిమానుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, కల్చరల్ ప్రోగ్రామ్స్, బాలయ్య సినీ జర్నీకి గుర్తు చేసే విజువల్ ప్రజెంటేషన్స్ కూడా ఉండే అవకాశముంది.

మరోవైపు ఎప్పటిలానే ఈసారి కూడా సేవా కార్యక్రమాలకు కూడా ఈసారి పెద్ద పీట వేస్తున్నారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, విద్యార్థులకు అవసరమైన సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు అభిమాన సంఘాలు సిద్ధమవుతున్నాయి. బాలయ్యపై ఉన్న అభిమానాన్ని సమాజ సేవ రూపంలో చూపించాలని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

ఇటీవల వరుస విజయాలతో బాలకృష్ణ కెరీర్ మరోసారి జోరందుకుంది. ప్రస్తుతం చేస్తున్న సినిమాలపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఆ విజయాల జోష్ కు బర్త్ డే సంబరాలు తోడవడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. అందుకే ఈసారి బాలయ్య పుట్టినరోజు కేవలం ఒక సెలబ్రేషన్ కాదు.. అభిమానుల ఎమోషనల్ సెలబ్రేషన్ గా మారబోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోస్టర్ తో మొదలైన హంగామా చూస్తుంటే జూన్ 7న బాలయ్య సోషల్ మీడియాను షేక్ చేయడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.

## నాగబంధం రిలీజ్ స్ట్రాటజీ.. సోలోగానే..

**కంటెంట్ మీద ఉన్న నమ్మకంతోనే పెద్దగా పోటీ లేని టైమ్ చూసుకుని ఈ భారీ అడ్వెంచరస్ థ్రిల్లర్ ను సోలోగా దించుతున్నారు. బాక్సాఫీస్ వద్ద క్లాష్ లేకుండా రిలీజ్ చేస్తే ఓపెనింగ్స్ అదిరిపోతాయనే ఆలోచనతో అభిషేక్ నామా టీమ్ పక్కా వ్యూహంతో బరిలోకి దిగుతోంది.**

మైథలాజికల్ ఫాంటసీ మూవీ ‘నాగబంధం’ జూలై 3న థియేటర్లలోకి రాబోతోంది. సమ్మర్ హడావిడి మొత్తం అయిపోయాక, బాక్సాఫీస్ దగ్గర ఏర్పడే గ్యాప్ ను వాడుకోవాలనేది మేకర్స్ సెట్ చేసిన అసలు ప్లాన్ అని అర్థమవుతుంది. కంటెంట్ మీద ఉన్న నమ్మకంతోనే పెద్దగా పోటీ లేని టైమ్ చూసుకుని ఈ భారీ అడ్వెంచరస్ థ్రిల్లర్ ను సోలోగా దించుతున్నారు. బాక్సాఫీస్ వద్ద క్లాష్ లేకుండా రిలీజ్ చేస్తే ఓపెనింగ్స్ అదిరిపోతాయనే ఆలోచనతో అభిషేక్ నామా టీమ్ పక్కా వ్యూహంతో బరిలోకి దిగుతోంది.




ఇక్కడ అందరికీ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తున్న పాయింట్ హీరో విరాట్ కర్ణ. కెరీర్ లో చేస్తున్నది రెండో సినిమానే అయినా, ఏకంగా పాన్ ఇండియా సబ్జెక్టును టేకప్ చేశాడు. 1750ల నాటి స్టోరీ, పాత కాలపు నిధులు, దైవిక శక్తులు అనగానే ఎవరైనా పెద్ద స్టార్స్ ను ఎక్స్ పెక్ట్ చేస్తారు. కానీ విజువల్స్ ని, స్టోరీని నమ్ముకుని ఒక కొత్త కుర్రాడితో ఇంత భారీ బడ్జెట్ సినిమా తీయడం ట్రేడ్ వర్గాల్లో కూడా హాట్ టాపిక్ గా మారింది.

రీసెంట్ గా హిట్టయిన మైథలాజికల్ సినిమాలు చూస్తే ఒక విషయం క్లియర్ గా అర్థమవుతుంది. స్టార్ డమ్ కంటే కూడా కంటెంట్ కే ఆడియన్స్ ఎక్కువ ఓట్లు వేస్తున్నారు. నాగబంధం పోస్టర్స్ చూస్తుంటే ఈ సినిమా కూడా అదే రూట్ లో వెళ్తున్నట్లు తెలుస్తోంది. విదేశీ దండయాత్రల నుంచి దేశ సంపదను, గుళ్లలో దాగి ఉన్న రహస్యాలను కాపాడే శివుని అంశతో నడిచే స్టోరీ ఇది. ఇలాంటి కథ ఎమోషనల్ గా కనెక్ట్ అయితే మాత్రం థియేటర్లలో ప్రేక్షకులకు ఫుల్ కిక్ ఇవ్వడం గ్యారెంటీ.

యంగ్ హీరోకి సపోర్ట్ గా సినిమాలో భారీ కాస్టింగ్ సెట్ చేశారు. జగపతి బాబు లాంటి సీనియర్ యాక్టర్ ఓ కీ రోల్ చేస్తుండటం సినిమాకు పెద్ద ప్లస్. ఇక గ్లామర్ డోస్ కోసం నభా నటేష్, ఐశ్వర్య మీనన్ లాంటి బ్యూటీస్ ఉన్నారు. లేటెస్ట్ గా రిలీజైన సుర సుర పాట చూస్తే సినిమా మాస్ ఆడియన్స్ కు కూడా బాగా రీచ్ అయ్యేలా ప్లాన్ చేశారని అర్థమవుతోంది. పెళ్లి బ్యాక్ డ్రాప్ లో వచ్చిన ఈ ఫోక్ సాంగ్ కు రెస్పాన్స్ బాగుంది.

ఇలాంటి పీరియాడిక్ కథలు తెరపై వర్కవుట్ అవ్వాలంటే టెక్నికల్ గా సినిమా చాలా స్ట్రాంగ్ గా ఉండాలి. వందల ఏళ్ల క్రితం నాటి ప్రపంచాన్ని కళ్ల ముందు ఉంచాలంటే ఆర్ట్ వర్క్, వీఎఫ్ఎక్స్ దే కీ రోల్. లేటెస్ట్ పోస్టర్ లో డీటెయిలింగ్ చూస్తే ప్రొడక్షన్ వాల్యూస్ లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదని తెలుస్తోంది. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో చీకటికి, వెలుగుకు మధ్య జరిగే ఫైట్ ను చాలా రిచ్ గా చూపించబోతున్నారు. ఇక జూలై 3వ తేదీ నాగబంధం టీమ్ కు ఒక పెద్ద టెస్ట్. పోటీ లేని టైమ్ లో వస్తున్నారు కాబట్టి, ఫస్ట్ డే మార్నింగ్ షోకి పాజిటివ్ టాక్ వస్తే మాత్రం కలెక్షన్స్ ఒక రేంజ్ లో ఉంటాయి. ఒక యంగ్ హీరో, భారీ కాన్సెప్ట్ తో వస్తున్న ఈ సినిమా టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలంటే ఇంకో నెల రోజులు ఆగాల్సిందే.

## డాన్ -3 వివాదానికి తాత్కాలిక తెర

### రణ్‌వీర్ లీగల్ నోటీసులు..నిషేధం ఎత్తివేసిన నిర్మాణ సంస్థ




బాలీవుడ్‌లో చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం రోజురోజుకూ ముదురుతోంది. తాజాగా ఈ వివాదం కోర్టు మెట్లెక్కింది. తనపై నిషేధం విధించిన ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సంస్థకు మంగళవారం రణ్‌వీర్ లీగల్ నోటీసులు పంపారు. మరోవైపు తమకు నోటీసులు అందినట్లు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేకర్ అశోక్ పండిట్ ధ్రువీకరించారు. బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించాలనుకున్న 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ మధ్యలో వైదొలిగారు. ఈ క్రమంలో.. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకూ ఆయనతో కలిసి పని చేయవద్దని ఆదేశిస్తూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై నటుడి టీమ్ స్పందిస్తూ.. ఆయనకు వృత్తిపై అపారమైన గౌరవం ఉందని తెలిపింది. సినిమా హిట్ కావాలని కోరుకుంటారని అందుకే ఈ వివాదంపై మౌనంగా ఉంటున్నారని వెల్లడించింది. ఈక్రమంలో బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్‌కు పెద్ద ఉపశమనం లభించింది. ఆయనపై విధించిన నాన్–కోఆపరేషన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ బుధవారం ప్రకటించింది. ఫర్హాన్ అక్తర్ సినిమా 'డాన్ 3' నుండి రణవీర్ తప్పుకోవడంతో ఈ వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రణవీర్ సింగ్ సదరు సంస్థకు లీగల్ నోటీసు పంపిన కొద్ది గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ , ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, మరియు సినీ / టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ లు ఈ గొడవలో జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో సమస్య సర్దుమణిగినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ప్రెసిడెంట్ బి.ఎన్. తివారీ మాట్లాడుతూ.. సినీ అసోసియేషన్ల అభ్యర్థన మేరకు రణవీర్ సింగ్‌పై ఉన్న నాన్–కోఆపరేషన్ ఆదేశాలను వెంటనే రద్దు చేస్తున్నాం. నిర్మాతలు, దర్శకులు లేదా నటులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందరం కలిసి కూర్చుని మాట్లాడుకుంటాం.

## ఇరుమడి తాజా గ్లింప్స్ విడుదల

మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి'ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన ఎమోషనల్ బాండింగ్ చుట్టూ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తాగుడికి బానిసైన తండ్రి ఆ వ్యసనానికి దూరమవ్వడం కోసం అయ్యప్ప మాలా వేసిన అనంతరం జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. అయ్యప్ప స్వామి భక్తి, అయ్యప్ప మాల నేపథ్యంతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆధ్యాత్మికత, ఫ్యామిలీ ఎమోషన్స్ సమానంగా ఉండేలా రవితేజను ఒక సరికొత్త రిఫ్రెషింగ్ అవతార్‌లో చూపించబోతున్నాడు శివ నిర్వాణ. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర, ఇతర కీలక పాత్రల్లో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని జులై లేదా ఆగస్టు 2026లో భారీ స్థాయిలో విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.




## విడుదలకు ముందే పెద్ది రికార్డులు

### వన్ మిలియన్ క్లబ్‌లో చేరిక

భారీ అంచనాలతో రానున్న 'పెద్ది' విడుదలకు ముందే రికార్డులు నెలకొల్పుతోంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే జూన్ 3న విడుదల కానుంది. అక్కడ ప్రీ బుకింగ్స్ ఓపెన్ కాగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. దీంతో ఈ చిత్రం రిలీజ్‌కు ముందే వన్ మిలియన్ క్లబ్‌లోకి చేరింది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత ప్రీమియర్స్ లోనే చరణ్‌కు ఇదే వన్ మిలియన్ మార్క్ సినిమాగా తెలుస్తోంది. మరోవైపు చిత్రబృందం ప్రచార జోరు పెంచింది. తాజాగా బుచ్చిబాబు ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. చరణ్ ఎంతో కష్టపడ్డారని అన్నారు. పెద్ది అందరి గుండెల్లో ఎప్పటికీ ఉండిపోతాడని చెప్పారు. అందుకు కారణం రామ్‌చరణ్ ఆ పాత్రలో ఒదిగిపోయిన విధానమేనన్నారు. కుస్తీ సన్నివేశాల్లో దెబ్బలు తగిలినా లెక్క చేయకుండా నటించారని ప్రశంసించారు. కంటికి గాయం అయినప్పుడు చిరంజీవి ఏమంటారో అని తనకు భయమేసిందని చెప్పారు. చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో జగపతి బాబు, శివరాజ్‌కుమార్ కీలకపాత్రలు పోషించారు.




Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com